విషం పనిచేసినంత వేగంగా
ఔషధం పనిచేయదు...
అబద్ధాన్ని నమ్మినంత వేగంగా
జనం నిజాన్ని నమ్మరు.!

నేటి మంచిమాట


DD9 వార్త

తెలుగు దినపత్రిక

www.dd9vaartha.com

సంపుటి : 01 సంచిక : 106 బుధవారం, డిసెంబర్ 03, 2025, పేజీలు - 10 వెల : 3/-


## 66 సివిల్ జడ్జి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ సర్వీసులో సివిల్ జడ్జిల(జూనియర్ డివిజన్) స్థాయిలో 66 పోస్టులను భర్తీ చేయడానికి ఆన్‌లైన్ పద్ధతిలో అర్హులైన వారినుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.సివిల్ జడ్జిల(జూనియర్ డివిజన్) పోస్టులకు డిసెంబర్ 8వ తేదీ నుంచి 29వ తేదీ వరకు దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా పంపాల్సి ఉంటుందని వెల్లడించారు. పోస్టుల పరీక్ష తేదీలు, హాల్‌టికెట్ల డౌన్‌లోడ్, కంప్యూటర్ ఆధారిత స్క్రీనింగ్ పరీక్ష తదితర వివరాలను వెబ్‌సైట్‌లో ప్రకటిస్తామని రిజిస్ట్రార్ చెప్పారు.దించాలని సూచించారు.

## పార్లమెంటులో సర్ ఆందోళనలు

- ఉభయసభల్లో చర్చకు పట్టు
- గందరగోళం మధ్య లోక్‌సభ నేటికి వాయిదా




## 50 రోజుల్లో 2వేల మంత్రాల పఠనం

- కాశీ కుర్రాడు వేదమూర్తికి మోడీ ప్రశంసలు




న్యూఢిల్లీ, 2 : ఏళ్ల పండితుడు వేదమూర్తి దేవావ్రత్ మహేశ్ రేఖీపై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. దండక్రామ పారాయాణాన్ని పూర్తి చేసిన క్రమంలో ఆ కుర్రాడిని ప్రధా ని మెచ్చు కున్నారు. శుక్ల యజు ర్వేదంలోని మధ్యాంధినిలో ఉన్న సుమారు 2000 మంత్రాలను ఆ యువకుడు పారాయణం చేశారు.

మిగతా2లో...

## ఖమ్మం జిల్లా అభివృద్ధి బాధ్యత నాది

- తెలంగాణ ఏర్పాటుకు పునాది పడింది ఇక్కడే
- తెలంగాణ ఇచ్చిన మన్మోహన్ పేరుతో ఎర్త్ వర్సిటీ
- గ్రామాల్లో మంచి సర్పంచ్‌నే ఎన్నుకోండి
- మంత్రులతో కలిసి పనిచేసే వారినే ఆదరించండి
- కొత్తగూడెంలో ఎర్త్ సైన్సెస్ వర్సిటీకి సిఎం రేవంత్ శంకుస్థాపన




కొత్తగూడెం,డిసెంబర్ 2 : ఖమ్మం జిల్లాను అభివృద్ధి పథంలో నడిపే బాధ్యత తనదేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కొత్తగూడెంలో డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ వర్సిటీని ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. 60 ఏళ్ల స్వరాష్ట్ర కలను తీర్చింది ఆనాటి ప్రధాని మన్మోహన్ సింగ్.. అందుకే దేశంలో ఉన్న ఏకైక ఎర్త్ సైన్స్ వర్సిటీకి ఆయన పేరు పెట్టామని తెలిపారు.

మిగతా2లో...

## పవన్ వ్యాఖ్యలను వక్రీకరించవద్దు

- జనసేన పార్టీ ప్రకటన విడుదల




అమరావతి,డిసెంబర్ 2 : ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పై వస్తోన్న విమర్శలపై జనసేన పార్టీ స్పందించింది. రైతులతో ముచ్చటిస్తూ చెప్పిన మాటలను వక్రీకరిస్తున్నారు. ఇరు రాష్ట్రాల మధ్య సుహృద్భావ వాతావరణం దృష్ట్యా పవన్ కల్యాణ్ మాటలను వక్రీకరించవద్దని

మిగతా2లో...

## అమిత్ షాతో లోకేశ్ తదితరుల భేటీ

- మొంథా తుఫాన్ నష్టంపై వివరణ
- త్వరగా సాయం కోరిన లోకేశ్
- ఏవియేషన్ సిటీపై జిఎంఆర్ అధికారులతో చర్చ




## రోహింగ్యాలకు రెడ్ కార్పెట్ ఆహ్వానం పలకాలా?

అదృశ్యంపై కేసులో సుప్రీం ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు



న్యూఢిల్లీ,డిసెంబర్ 2 : రోహింగ్యా శరణార్థులను వెనకేసుకుని వచ్చేలా పిటిషన్ దాఖలు చేయడంపై సుప్రీం ఆగ్రహం వ్యక్తం చేసింది. రోహింగ్యాల అదృశ్యంపై దాఖలైన హెబియస్ కార్పస్ పిటిషన్ విచారణ సందర్భంగా.. సుప్రీంకోర్టుకీలక వ్యాఖ్యలు చేసింది. దేశంలోకి అక్రమంగా ప్రవేశించే వారికి..

మిగతా2లో...

## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సు

- నేడు ప్రధానిని ఆహ్వానించనున్న సిఎం రేవంత్
- వివిధ రాష్ట్రాల బాధ్యతలు మంత్రులకు అప్పగింత




హైదరాబాద్,డిసెంబర్ 2 : తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సుకు ప్రధాన మంత్రి మోదీ సహా అన్ని రాష్ట్రాల సీఎంలను ఆహ్వానించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించా రు. ఢిల్లీ వెళ్తోన్న సీఎం రేవంత్‌రెడ్డి.. బుధవారం ఉదయం 11 గంటలకు ప్రధాని మోదీతో భేటీ కానున్నారు. 'తెలంగాణ రైజింగ్-2025' సదస్సుకు రావాలని ప్రధానిని ఆహ్వానించను న్నారు. అనంతరం పలువురు కేంద్రమంత్రు లనూ సదస్సుకు ఆహ్వానించాను న్నారు. అలాగే కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్, మల్లికార్జున ఖర్గే సహా ఇతర కేంద్రమంత్రులను ఆహ్వానించనున్నారు.

మిగతా2లో...



## పవన్ జీ క్షమాపణలు చెప్పండి

- లేదంటే తెలంగాణలో మీ సినిమాలు ఆడవ్
- సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి హెచ్చరిక

హైదరాబాద్,డిసెంబర్ 2 : ఎపి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు రాజకీయాలు తెలియవని తెలంగాణ రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. పవన్ కల్యాణ్ తెలిసీ తెలియకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. డిప్యూటీ సీఎం కాగానే ఆయన ఏదేదో మాట్లాడుతున్నారని తెలిపారు. ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కోనసీమలో పర్యటించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలంటూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను ఆయన డిమాండ్ చేశారు. పవన్ క్షమాపణ చెబితే.. తెలంగాణలో ఆయన సినిమా ఒకటి, రెండు రోజులు ఆడుతుందన్నారు. లేకుంటే సినిమాలు ఆడవని మంత్రి కోమటిరెడ్డి చెప్పారు. పవన్ కల్యాణ్

మిగతా2లో...

## హిల్ట్ పాలసీపై బిఆర్ఎస్ పోరుబాట

- ఎనిమిది బృందాలతో ఆయా ప్రాంతాల్లో పరిశీలన
- నేటి నుంచి రెండ్రోజులు ఎనిమిది బృందాల పర్యటన
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ వెల్లడి



హైదరాబాద్,డిసెంబర్ 2 : గ్రేటర్ పరిధిలోని రూ.5లక్షల కోట్ల విలువైన పారిశ్రామిక భూములను హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ హిల్ట్ పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకు నేందుకు బీఆర్ఎస్ సిద్ధమైంది. ఇందులో భాగంగా పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు

మిగతా2లో...

## నేషనల్ హెరాల్డ్ కేసులకు భయపడేది లేదు

- సోనియా, రాహుల్‌లకు అండగా మనమంతా ఉన్నాం
- రాష్ట్రాన్ని బిఆర్ఎస్ పదేళ్లు పాలించినా ఒక్క ఎయిర్‌పోర్ట్ రాలే
- అభివృద్ధి,సంక్షేమంతో ముందుకు దూసుకెళ్తున్నాం
- పిసిసి సమావేశంలో సిఎం రేవంత్ కీలక ప్రసంగం

2లో



## అధిష్ఠానం ప్రకటిస్తే డీకే శివకుమార్ సీఎం అవుతాడు : సిద్ధరామయ్య




కర్ణాటక,డిసెంబర్ 2 : కర్ణాటకలో సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డికే శివకుమార్ మధ్య సీఎం కుర్చీ కోసం రాజుకున్న వివాదం దేశవ్యాప్తంగా చర్చనీయాంశం కావడంతో.. కాంగ్రెస్ పార్టీ నష్ట నివారణ చర్యలకు పూనుకుంది. బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ ఏర్పాటు చేసి ఐక్యతను చాటుకోవాలని సూచించింది. దాంతో ఇప్పటికే సిద్ధరామయ్య ఇంట్లో బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ ముగిసింది. ఇవాళ డీకే శివకుమార్ రెండో బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ కూడా నిర్వహించారు.ఆ సమావేశం అనంతరం సిద్ధరామయ్య మీడియా తో మాట్లాడుతూ.. పార్టీ అధిష్ఠానం ప్రకటిస్తే డీకే శివకుమార్ సీఎం అవుతాడని అన్నారు. మా ఇద్దరి మధ్య ఎలాంటి విభేదాలు లేవని, ఇద్దరం కలిసికట్టుగా రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేస్తున్నామని చెప్పారు. ఇద్దరికీ హైకమాండ్ ఆదేశాలే శిరోధార్యమని, ఎవరు

మిగతా2లో...

బుధవారం
డిసెంబర్ 03 2025
DD9 వార్త
తెలుగు దినపత్రిక



# అమిత్ షాతో లోకేశ్ తదితరుల భేటీ

**న్యూఢిల్లీ, డిసెంబర్ 2** : మొంథా తుఫాన్ ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర నష్టాన్నే మిగిల్చింది.. ఇప్పటికే ప్రాథమిక అంచనాలపై కేంద్రానికి నివేదిక చేరగా.. ఢిల్లీ పర్యటనలో ఉన్న మంత్రి నారా లోకేష్, హోంమంత్రి అనిత.. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాతో సమావేశమయ్యారు. మొంథా తుపాను కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో భారీ నష్టం జరిగిందని వివరించారు. ఈ నేపథ్యంలో తుపాను నష్టాలపై మంత్రి నారా లోకేష్ పూర్తి నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో మంత్రి లోకేష్, రాష్ట్ర హోంమంత్రి అనిత ఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తుపాను ప్రభావం, పునరావాస చర్యలు, నష్టపరిహారం అవసరాలపై సమగ్ర వివరాలు లోకేష్ అందించారు. తుపాను వల్ల మొత్తం రూ.6,352 కోట్ల నష్టం జరిగినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నివేదికలో పేర్కొంది.మొంథా తుపాను మొత్తం 3,109 ప్రభావిత గ్రామాల్లో ప్రభావం చూపించింది.. తుపాను తీరం దాటి సమయం: అక్టోబర్ 28 రాత్రి, కాకినాడ సమీపంలో గాలి వేగం గంటకు 100 కి.మీ వేగంతో ఉంది. అయితే, పునరావాస చర్యల్లో 1.92 లక్షల మందిని 2,471 శిబిరాలకు తరలించాం. తుఫాను అనంతరం ప్రభావిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున వెంటనే రూ.3,000 చొప్పున తక్షణ ఆర్థిక సాయం పంపిణీ చేసింది. అదేవిధంగా, కూలిన చెట్ల తొలగింపు, విద్యుత్ పునరుద్ధరణ, తాగునీటి సరఫరా వంటి అత్యవసర చర్యలు చేపట్టినట్లు లోకేష్ వివరించారు. అత్యవసర అవసరాల నిమిత్తం రూ.60 కోట్లు ప్రభుత్వ ఖజానా నుంచి విడుదల చేసినట్లు తెలిపారు. ఇదిలావుంటే దిల్లీలో ఏపీ మంత్రి లోకేశ్ పర్యటన కొనసాగుతోంది. విమానాశ్రయాల రూపకల్పన, నిర్మాణం, నిర్వహణలో అంతర్జాతీయంగా పేరున్న జీఎంఆర్ సంస్థకు చెందిన సీనియర్ అధికారులతో మంత్రి లోకేశ్ మంగళవారం భేటీ అయ్యారు. ఏపీలోని విశాఖపట్నం వద్ద దేశంలోనే తొలి ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ అభివృద్ధిపై విస్తృతంగా చర్చించారు. ఎడ్యుసిటీని జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేయనున్నారు. విశాఖ ప్రాంతంలో ఏవియేషన్ ఎడ్యుసిటీ అభివృద్ధి ద్వారా విమానయాన, అంతరిక్ష, రక్షణ రంగాల.. విద్య, శిక్షణకు హబ్‌గా మారుతుంది. ఇందుకోసం ప్రత్యేక నైపుణ్యం కలిగిన అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలను తీసుకురానున్నారు. ఏవియేషన్ ఎడ్యుసిటీ ఏర్పాటు ఉత్తరాంధ్ర ప్రాంతానికి గేమ్ ఛేంజర్‌గా మారడంతో పాటు ఏపీ ఏవియేషన్ క్లస్టర్ అభివృద్ధిని వేగవంతం చేయనుంది. ఈ సమావేశంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లా అభివృద్ధి బాధ్యత నాది

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ ఉద్యమానికి పునాది రాయి పడింది కూడా పాల్వలంచోలనే అని అన్నారు. రాష్ట్ర ప్రజల చిరాకాల వాంఛ నెరవేర్చిన మన్మోహన్‌సింగ్ పేరుతో ఎర్త్ సైన్స్ వర్సిటీ ఏర్పాటు చేసుకోవడం గర్వకారణం అన్నారు. ఎడ్యుకేషన్, ఇరిగేషన్ రంగాలే ప్రపంచపటంలో తెలంగాణను నిలబెడుతున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేస్తాం. భద్రాచలం రాముల వారి సాక్షిగా చెబుతున్నా.. అన్ని జిల్లాలతో పాటు ఖమ్మం జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించే బాధ్యత నాది. పాలనకు ఆయువుపట్టయిన శాఖలన్నీ ఖమ్మం జిల్లా మంత్రుల చేతుల్లోనే ఉన్నాయి. రెండేళ్ల క్రితం మీరంతా ఓట్లేసి గెలిపిస్తేనే.. ప్రజలకు మంచి పాలన అందిస్తున్నాం అన్నారు. మంచి ప్రభుత్వం ఉంటేనే ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం, ఉచిత కరెంట్, రేషన్ కార్డులు వస్తాయి. గ్రామాల్లో సర్పంచ్‌లు కూడా మంచోళ్లు ఉండాలి. మంత్రులతో కలిసి పనిచేసే మంచి సర్పంచి మీ ఊళ్లో లేకపోతే.. గ్రామాలు దెబ్బతింటాయని అన్నారు. రాజకీయ కక్షలు మాని పదేళ్లు అండగా నిలబడండి. తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలబెడదాం. సర్పంచ్ ఎన్నికల్లో మంత్రులు, తుమ్మల, భట్టి, పొంగులేటితో కలిసి గ్రామాలను అభివృద్ధి పథం వైపు నడిపించే వారిని ఎన్నుకోండని సీఎం విజ్ఞప్తి చేశారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కు కంచుకోట అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా మొత్తం కాంగ్రెస్ కు అండగా నిలబడిందన్నారు. 1969లో తెలంగాణ ఉద్యమానికి పునాదులు పడ్డవే పాల్వంచలోనేనని చెప్పారు. 60 ఏండ్లు ఉద్యమం నడవడానికి కారణం ఈ పాల్వంచనే అని చెప్పారు. కొత్తగూడెం థర్మల్ పవర్ ప్లాంట్ కోసం వేలాది ఎకరాలు భూమి ఇచ్చారని చెప్పారు. దేశంలో వ్యవసాయం అభివృద్ధికి కారణం కాంగ్రెస్ అన్నారు రేవంత్. నాగార్జున సాగర్,శ్రీశైలం, ఎస్సారెస్పీ ప్రాజెక్టులు నెహ్రూ కట్టినవేనని తెలిపారు. ఈ పదేళ్లలో ఖమ్మం జిల్లాలోని ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. కృష్ణా,గోదావరి జలాలతో ఖమ్మం జిల్లా తడవాలన్నారు. ఎడ్యుకేషన్ కు సంబంధించి ప్రతీ అవకాశాన్ని జిల్లాకు ఇస్తున్నామన్నారు. పదేండ్లు పాలించినోళ్లు అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. ఖమ్మం జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించే బాధ్యత తనదన్నారు. సర్కార్ ఏ సంక్షేమ పథకం మొదలు పెట్టినా..ఖమ్మం జిల్లా నుంచే ప్రారంభించామని.. సన్నబియ్యం,రేషన్ పంపిణీ ఈ జిల్లా నుంచే ప్రారంభించామన్నారు. మీ ఓటే ఆయుధంగా మారి ప్రజాపాలన అందిస్తుందన్నారు. మంచోడినే సర్పంచ్ గా ఎన్నుకోవాలని.. మందుకో..డబ్బుకో ఓటేస్తే ఊరు మునుగుతుందని సూచించారు.ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల పొంగులేటి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎంపిలు పాల్గొన్నారు.

# నేషనల్ హెరాల్డ్ కేసులకు భయపడేది లేదు

**హైదరాబాద్,డిసెంబర్ 2** : కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలపై కేసులు పెడితే భయపడేది లేదని తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజాగా టీపీసీసీ సమావేశంలో పలు అంశాలపై మాట్లాడారు. పార్టీ నేతలు, కార్యకర్తలకు కీలక సందేశం పంపిస్తూ పలు రాజకీయ, పరిపాలనా అంశాలపై తన అభిప్రాయాలు వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం, ముఖ్యంగా ప్రధాని మోదీ వైఖరి పై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తూ.. కాంగ్రెస్ నాయకత్వానికి మద్దతుగా నిలబడాలని పిలుపుని చ్చారు. సీఎం మాట్లాడుతూ.. గాంధీని హత్య చేసిన పార్టీ బీజేపీ అని అన్నారు.. నేషనల్ హెరాల్డ్ కేసు పేరుతో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను వేధించడం మోదీ ప్రభుత్వ లక్ష్యపూర్వక చర్యే అని విమర్శించారు. ఓటు చోరీపై పార్లమెంట్‌లో చర్చ జరగకుండా విచ్చలవిడిగా కేసులు తెరపైకి తీసుకువచ్చారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ విలువలను కాపాడే బాధ్యత అందరిదినని, రాహుల్ గాంధీ, సోనియా గాంధీలకు మద్దతుగా నిలబడే తీర్మానం చేసుకోవాలని పిలుపునిచ్చారు. నేషనల్ హెరాల్డ్ సిబ్బందికి వీరు ఆర్థిక సహాయం అందించారన్నారు. ప్రైవేట్ సంస్థల్లో పని చేసిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఉండవని.. ఈ నేపథ్యంలో ఎప్పుడో మూతపడిన నేషనల్ హెరాల్డ్ సిబ్బందిని మంచి ఆలోచనతో వీరు ఆర్థికంగా ఆదుకున్నారని గుర్తు చేశారు. పత్రికను తిరిగి నడిపించాలనే ఉద్దేశ్యంతో బోర్డు ఆఫ్ డైరెక్టర్లుగా కొంత మంది కాంగ్రెస్ పార్టీ నేతలను తీసుకున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఒక పత్రిక ఉండాలని నిర్ణయించి.. నేషనల్ హెరాల్డ్ పత్రిక పునరుద్ధరించే ప్రక్రియను వారు చేపట్టారని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. దేశం కోసం గాంధీ కుటుంబం త్యాగం చేసిందని ఆయన పునరుద్ఘాటించారు. మంగళవా రం హైదరాబాద్‌లో టీపీసీసీ కార్యవర్గ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. దేశంలో కోసం గాంధీ కుటుంబం చేసిన త్యాగాలను ఆయన సోదాహరణంగా వివరించారు. డిసెంబర్ 7వ తేదీన ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్తామని చెప్పారు. ఈ యూనివర్సిటీ అభివృద్ధికి ఎంత ఖర్చు అయినా నిధులు కేటాయిస్తామన్నారు. ఓయూను ప్రపంచ స్థాయిలో నిలబెడతామని ఆయన ప్రకటించారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నామన్నారు. 9వ తేదీన తెలంగాణ – 2047 పాలసీ డాక్యుమెంట్ ఆవిష్కరణ చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి దిగ్గజ నేతల సలహాలు సైతం తీసుకున్నామని పేర్కొన్నారు. కోర్ అర్బన్‌ను క్యూర్ చేయాలని తాము నిర్ణయించామన్నారు. కాలుష్య కారక పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలిస్తున్నామని స్పష్టం చేశారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, పరిశ్రమల తరలింపు తదితర అంశాలు తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని వివరించారు. కొన్ని పరిశ్రమలు నడిచే పరిస్థితి లేక మూతపడ్డాయన్నారు. మరికొన్ని పరిశ్రమల ఊరు, నగరం నడిబొడ్డున ఉన్నాయని.. ఆయా పరిశ్రమల ను తరలిస్తే కొంత భూమి అందుబాటులోకి వస్తుందని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే అభివృద్ధి ప్రణాళికలపై మాట్లాడుతూ.. నాచారం ప్రాంతంలోని పరిశ్రమలను పట్టణం వెలుపలకు మార్చాలని, ఇందుతో మధ్యతరగతి కుటుంబాలు భూములు కొనుగోలు చేయగలవని, పేదలకు అవకాశాలు పెరుగుతాయని చెప్పారు.తాను సీఎం అయ్యే ముందు కొంతమంది పై కోపం ఉన్నా, ఇప్పుడు పనిపై దృష్టి పెట్టి సైలెంట్‌గా ముందుకు సాగుతున్నానని చెప్పారు. కాంగ్రెస్‌లో విభిన్న మనస్తత్వాలు ఉన్నప్పటికీ, మంచి అభిప్రాయం, మంచి ఉద్దేశాలు మాత్రం ఏకం గా ఉండాలని సూచించారు. ఇక చివరలో.. రాహుల్ గాంధీని ప్రధాని చేయాల్సిన బాధ్యత మనదే. నేను సీఎం కావచ్చు, కానీ ఆ పదవులు పొందడం నిజమైన కష్టమే. ఆ విలువ మీకు తెలుసు. అందరం కలిసే పని చేసినప్పుడే కాంగ్రెస్ బలపడుతుందని అన్నారు. టిపిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# హిల్ట్ పాలసీపై బిఆర్ఎస్ పోరుబాట

(మొదటి పేజీ తరువాయి)

వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్రవ్యాప్తంగా సీనియర్ నాయకులతో కూడిన నిజనిర్ధారణ బృందాలను నియమించారు. ఈ మేరకు పార్టీ ముఖ్య నేతలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేటీఆర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, క్షేత్రస్థాయి పర్యటనలపై దిశానిర్దేశర చేశారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత ప్రభుత్వాలు పరిశ్రమల స్థాపన కోసం, ఉపాధి కల్పన కోసం అతి తక్కువ ధరకే కేటాయించిన భూములను, ఇప్పుడు 'మల్టీ యూజ్ జోన్' పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి మారుస్తున్నారని ఆరోపించారు. సుమారు 9,300 ఎకరాల భూములను మార్కెట్ విలువ కంటే అతి తక్కువకు, కేవలం ఎస్ఆర్ఓ రేటులో 30 శాతానికే రెగ్యులరైజ్ చేసి, సుమారు రూ. 5 లక్షల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టే కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టడానికి, కనీసం స్మశాన వాటికలకు కూడా స్థలాలు లేవని చెబుతున్న ప్రభుత్వం, వేల కోట్ల విలువైన భూములను మాత్రం ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నదని మండిపడ్డారు.ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు హైద రాబాద్ చుట్టుపక్కల ఉన్న పారిశ్రామిక వాడలను 8 క్లస్టర్లుగా విభజించి, పార్టీ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో బృందాలు పర్యటించనున్నాయి. అక్కడ స్థానిక నాయకులను, ప్రజలను కలుపుకొని వాస్తవ మార్కెట్ విలువకు, ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఉన్న భారీ వ్యత్యాసాన్ని ప్రజల ముందు ఉంచనున్నారు. వీటితో పాటు అక్కడి పారిశ్రామిక వాడల ద్వారా ప్రజా ఉపయోగ కార్యక్రమాలు ఏమేమి చేయవచ్చు, అక్కడి స్థానిక ప్రజల సుదీర్ఘకాలం డిమాండ్లను ఆకాంక్షలను కూడా పార్టీ నేతలు తెలుసుకోనున్నారు. ఒకప్పుడు అక్కడ పారిశ్రామిక వాడల ఏర్పాటు కోసం ప్రజలు భూములు ఇచ్చిన తీరును ప్రభుత్వం కేటాయించిన తీరును వాటిని అత్యంత చవకగా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వాలు కట్టబెట్టిన అంశాన్ని, వాటి ఉద్దేశాలను పార్టీ నేతల బృందాలు ప్రస్తావించనున్నాయి.డిసెంబర్ 3, 4 తేదీల్లో హిల్ట్ పాలసీ స్కామ్‌పై నిజనిర్ధారణ కోసం బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన ఎనిమిది బృందాలు ఆయా ప్రాంతాల్లో పర్యటించనున్నాయి. ఇందులో భాగంగా..క్లస్టర్–1లో సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు నేతృత్వంలో మాజీమంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మెదక్ ఎమ్మెల్యేల బృందం పాశమైలారం, పటాన్ చెరువు, రామచంద్రాపురం ప్రాంతాలను సందర్శించనున్నారు.క్లస్టర్–2లో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి నేతృత్వంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ సురభి వాణీ దేవి, ఉప్పల్ నాయకులు కలిసి నాచారం, మల్లాపూర్, ఉప్పల్, చర్లపల్లి ప్రాంతాల్లో పర్యటిస్తారు.క్లస్టర్–3లో శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనా చారి నేతృత్వంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావుతో కూడిన బృందం మౌలాలి, కుషాయిగూడ పారిశ్రామిక వాడల్లో పర్యటిస్తారు. క్లస్టర్–4లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానందతో కలిసి జీడిమెట్ల, కూకట్‌పల్లి ప్రాంతాల్లో పర్యటించనున్నారు.

# పార్లమెంటులో సర్ ఆందోళనలు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 2** :ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ వ్యతిరేకంగా విపక్షాలు ఆందోళనకు దిగడంతో పార్లమెంట్ ఉభయసభలు దద్దరిల్లాయి. ఓట్ చోరీ, గద్ది చోరీ అంటూ ప్రతిపక్ష పార్టీల ఎంపీలు నినాదాలు చేశారు. ఫలితంగా ఉభయసభల్లో గందరగోళం నెలకొన్నది. లోక్‌సభ ను కంట్రోల్ పెట్టేందుకు స్పీకర్ ఓంబిర్లా చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దాంతో స్పీకర్ ముందుగా సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. మధ్యాహ్నం 12 గంటలకు సభ తిరిగి ప్రారంభమైనా సేమ్ సీన్ రిపీట్ అయ్యింది. దాంతో మధ్యాహ్నం 2 గంటల వరకు సభ వాయిదా పడింది. మధ్యాహ్నం రెండు గంటలకు సభ పునఃప్రారంభ మైనా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదు. గందరగోళం కొనసాగింది. దాంతో స్పీకర్ సభను బుధవారానికి వాయిదా వేశారు. అంతకుముందు ప్రతిపక్ష సభ్యులు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ ఈ ఆందోళనల్లో పాల్గొన్నారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో కేంద్ర ఎన్నికల సంఘం బీజేపీకి ఓట్లు దోచిపెట్టే పని చేస్తున్నదని విమర్శించారు.

# 50 రోజుల్లో 2వేల మంత్రాల పఠనం

(మొదటి పేజీ తరువాయి)

వరుసగా 50 రోజుల్లో ఆ మంత్రాలను అతను వల్లించాడు. ఇదో గొప్ప ఘనత అని ప్రధాని మోదీ తన ప్రశంసలో పేర్కొన్నారు. రాబోయే తరాలు ఈ అద్భుత ఘనతను గుర్తుంచుకుంటాయని అన్నారు. భారతీయ సంస్కృతి పట్ల ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ ఆ కుర్రాడు సాధించిన ఘనతను గర్విస్తారన్నారు. ఎటువంటి అవరోధాలు లేకుండా శుక్ల యుజుర్వేదంలోని 2 వేల మంత్రాలను ఆ యువకుడు పఠించినట్లు చెప్పారు. కాశీ నియోజకవర్గానికి చెందిన ఆ కుర్రాడు ఆ పవిత్ర పట్టణంలో అసాధారణ ఫీట్‌ను సాధించడం పట్ల సంతోషంగా ఉందని ప్రధాని అన్నారు. తన ఎక్స్ అకౌంట్‌లో మోదీ మెసేజ్ చేశారు. ఆ కుర్రాడికి సపోర్టు ఇచ్చిన కుటుంబసభ్యులకు, పండితులుకు, సంస్థలకు ప్రధాని థ్యాంక్స్ తెలిపారు. మరో వైపు హర్యానాలోని జాజర్‌లో ఉన్న సిద్ధ బాబా పాల్‌నాథ్ ఆశ్రమాన్ని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ సందర్శించారు. ప్రాణ ప్రతిష్ట, ఆత్మ భండార కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. సనాతన సంస్కృతి, మానవ పరిణామ క్రమంలో దాని ప్రభావాన్ని ఆయన తన ప్రసంగంలో తెలిపారు.

# పవన్ వ్యాఖ్యలను వక్రీకరించవద్దు

(మొదటి పేజీ తరువాయి)

జనసేన పార్టీ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఇటీవల కోనసీమ జిల్లాలో దెబ్బతిన్న కొబ్బరి చెట్లను పరిశీలించేందుకు అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..గోదావరి జిల్లాలు అన్నపూర్ణగా భాసిల్లుతున్నాయి. రాష్ట్రం విడిపోవడానికి కారణం వీటి పచ్చదనమే. నిత్యం పచ్చగా ఉంటుందని తెలంగాణ నాయకులంతా అంటారు. ఇప్పుడు కొబ్బరికి దిష్టి తగిలినట్లుంది అని పవన్ వ్యాఖ్యానించారు.

# రోహింగ్యాలకు రెడ్ కార్పెట్ ఆహ్వానం పలకాలా?

(మొదటి పేజీ తరువాయి)

న్యాయస్థానం అసాధారణ రక్షణలు కల్పించాలా అని ప్రశ్నించింది. రోహింగ్యాలు అదృశ్యమవుతున్నారని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్‌పై భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా 'వారికి రెడ్‌కార్పెట్ వేసి.. ఆహ్వానించాలని మీరు కోరుకుంటున్నారా' అని పిటిషనర్‌ను సూటిగా ప్రశ్నించింది. రోహింగ్యాలు సొరంగ మార్గాల ద్వారా భారత్‌లోకి వచ్చి.. ఆహారం, ఆశ్రయం వంటి హక్కులను డిమాండ్ చేస్తున్న విషయాన్ని ప్రస్తావించింది. 'ఉత్తర భారతదేశంలో మనకు చాలా సున్నితమైన సరిహద్దు ఉంది. చొరబాటుదారులు చట్టవిరుద్ధంగా ప్రవేశిస్తే.. వారిని ఇక్కడ ఉంచాల్సిన బాధ్యత మనకు ఉందా?' అని వ్యాఖ్యానించింది.

# తెలంగాణ....

(మొదటి పేజీ తరువాయి)

సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు పలువురు మంత్రులు గురువారం వివిధ రాష్ట్రాలకు వెళ్లి సీఎంలను ఆహ్వానించనున్నారు. రాష్ట్ర ఎంపీల బృందం.. దిల్లీ సీఎం, కేంద్రమంత్రులు, గవర్నర్లను ఆహ్వానించనుంది. ఈ మేరకు మంత్రులకు ఆహ్వాన బాధ్యతలను అప్పగించారు. ఇందులో భాగంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి – జమ్ముకశ్మీర్, గుజరాత్ రాష్ట్రాలకు వెళ్లి సిఎంలను ఆహ్వానిస్తారు. దామెదర్ రాజనర్సింహ – పంజాబ్, హరియాణాలకు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి – ఆంధ్రప్రదేశ్ శ్రీధర్‌బాబు – కర్ణాటక, తమిళనాడు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి – ఉత్తర్‌ప్రదేశ్, పొన్నం ప్రభాకర్ – రాజస్థాన్ కొండా సురేఖ – ఛత్తీస్‌గఢ్, సీతక్క – పశ్చిమ బెంగాల్, తుమ్మల నాగేశ్వరరావు – మధ్యప్రదేశ్, జూపల్లి కృష్ణారావు – అస్సాం, వివేక్ – బిహార్, వాకిటి శ్రీహరి – ఒడిశా, అడ్లూరి లక్ష్మణ్ – హిమాచల్‌ప్రదేశ్, మహ్మద్ అజారుద్దీన్ –మహారాష్ట్ర సీఎంను ఆహ్వానించనున్నారు.

# పవన్ జీ క్షమాపణలు చెప్పండి

(మొదటి పేజీ తరువాయి)


సోదరుడు చిరంజీవి సూపర్ మ్యాన్ అని ఈ సందర్భంగా అభివర్ణించారు. ఆయనకు రాజకీయా లతో సంబంధం లేదని గుర్తు చేశారు. అన్ని తెలుసుకుని మాట్లాడితే మంచిదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు మంత్రి హితవు పలికారు. పవన్ కల్యాణ్ వ్యాఖ్యల వల్ల తెలంగాణ ప్రజలు బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తాము ఎంతో నష్టపోయామని మంత్రి కోమటిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ ఆదాయాన్ని విశాఖపట్నం, కాకినాడ, తిరుపతికే వాడుకున్నారని వివరించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ వల్ల నష్టపోయామని గుర్తు చేసుకున్నారు. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నామని మంత్రి కోమటిరెడ్డి చెప్పుకొచ్చారు. కోనసీమ ప్రాంతంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటించారు.

# అధిష్ఠానం ప్రకటిస్తే డీకే శివకుమార్ సీఎం అవుతాడు : సిద్ధరామయ్య

(మొదటి పేజీ తరువాయి)

ఎప్పుడు ఏ పదవిలో ఉండాలనే విషయాన్ని అధిష్ఠానమే నిర్ణయిస్తుందని సిద్ధరామయ్య తెలిపారు.సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య సీఎం పదవి కోసం విభేదాలు నెలకొన్నాయని గత కొన్ని రోజులుగా ప్రచారం జరిగింది. ఒక దశలో సీఎం, డిప్యూటీ సీఎం సోషల్ మీడియాలో పోటీపోటీగా పోస్టులు పెట్టుకునే స్థాయికి గొడవ చేరింది. ఈ క్రమంలో రంగంలోకి దిగిన హైకమాండ్ ఆదేశాలతో నేతలిద్దరూ వెనక్కి తగ్గారు. హైకమాండ్ సూచన మేరకు బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లు నిర్వహించారు.

# బాచుపల్లిలో ఇద్దరు ఇంటర్ విద్యార్థుల సూసైడ్.!



**హైదరాబాద్, డిసెంబర్ 02:** నగరంలోని బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు విద్యార్థులు సూసైడ్ చేసుకున్నారు. వేర్వేరు కళాశాలల్లో ఇంటర్మీడియట్ చదువుతున్న వీరు ఇలా ఆత్మహత్యకు పాల్పడటం తీవ్ర కలకలం రేపుతోంది. శ్రీ చైతన్య జూనియర్ కాలేజీలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న 16 ఏళ్ల ఓ విద్యార్థిని కళాశాలలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈమె సొంతూరు మహబూబ్ నగర్ జిల్లా మక్తల్. అయితే.. ఈమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. హాస్టల్ నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. విద్యార్థిని మ ృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక గాంధీ ఆస్పత్రికి తరలించారు.

**- ప్రగతినగర్‌లో మరో విద్యార్థి..**

మరో ఘటనలో బాచుపల్లి పీఎస్ పరిధి ప్రగతి నగర్‌లోని ప్రగతి జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థి కూడా బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఇంట్లో ఉరివేసుకున్న అతని ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. శవపరీక్షల కోసం మ ృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

# తెలంగాణ రాజ్ భవన్ పేరు మార్పు




**హైదరాబాద్, డిసెంబర్ 02:** రాజభవన్ పేరు మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం నోటిషికేషన్ జారీ చేసింది. రాజభవను 'లోకభవన్'గా మార్చింది. గవర్నర్ల అధికారిక నివాసాలకు పేరు మార్చాలని కేంద్రం రాష్ట్రాలకు సూచించిన నేపథ్యంలో తాజాగా ఈ నిర?యం తీసుకుంది.

# ఎక్సైజ్ అధికారులపై అటవీ శాఖ కొరడా




**బోధన్, నిజామాబాద్ జిల్లా, డిసెంబర్ 02,(డీడీ9 వార్త) :** నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన బోధన్ ఎక్సైజ్ అధికారులపై అటవీ శాఖ కొరడా ఝుళిపించింది. అటవీ అధికారుల అనుమతి లేకుండా చెట్లను నరికినందుకు గానూ వారికి ?3,490 జరిమానా విధించింది. వివరాల్లోకి వెళితే.. చెట్లను నరకడానికి ముందస్తుగా అటవీశాఖ అధికారుల నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందాల్సి ఉంటుంది. బోధన్ ఎక్సైజ్ అధికారులు ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే చెట్లను నరికారు. ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీనిపై స్పందించిన అటవీశాఖ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టారు. అనుమతి లేకుండా చెట్లు నరికినందుకుగాను రూ. 3,490 జరిమానా విధించినట్లు ఫారెస్ట్ సెక్షన్ అధికారి తెలిపారు. మొదటి నుంచీ ఎక్సైజ్ అధికారుల తీరు వివాదాస్పదంగానే ఉంటోందని, వారి నిర్లక్ష్యానికి అటవీ శాఖ విధించిన ఈ జరిమానా మరో నిదర్శనంగా నిలుస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇకనైనా ఎక్సైజ్ అధికారులు తమ తీరు మార్చుకుని మెరుగైన సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

# తల్లి ఆరోగ్యంపైనే శిశువు అభివృద్ధి : సాలూర పీహెచ్‌సీ వైద్యుడు రాజ్ కుమార్



**బోధన్, నిజామాబాద్ జిల్లా, డిసెంబర్ 02,(డీడీ9 వార్త) :** బోధన్ మండలం ఫతేపూర్ అంగన్వాడీ కేంద్రాన్ని సాలూర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ రాజ్‌కుమార్ మంగళవారం సందర్శించారు. అంగన్వాడీ సేవల అమలు, గర్భిణీలకు అందిస్తున్న పౌష్టికాహార పంపిణీ విధానాన్ని పరిశీలించిన ఆయన, ఈ సందర్భంగా స్వయంగా గర్భిణీ మహిళలకు బాలామ ృతం ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ...గర్భిణీల ఆరోగ్యం అత్యంత ప్రాధాన్యమని, తల్లి ఆరోగ్యం మెరుగ్గా ఉండటం వల్లే శిశువు అభివ ృద్ధి సక్రమంగా జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న బాలామ ృతం అవసరమైన పోషకాలు, విటమిన్లు, ఖనిజ లవణాలతో కూడిన సమతుల్య ఆహారమని, గర్భిణీలు దీన్ని నిరంతరంగా తీసుకోవాలని సూచించారు. ఏవైనా అస్వస్థత లేదా సమస్యలు ఎదురైనప్పుడు ఆరోగ్య సిబ్బందిని వెంటనే సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ భారతి తదితరులు ఉన్నారు.

# సర్పంచ్ స్థానాలన్నీ బిజెపి కైవసం చేసుకుంటుంది

**- బిజెపి మండల అధ్యక్షులు పోరెడ్డి శ్రీనివాస్**

**- బజార్ హత్నూర్ మండలంలోని అన్ని సర్పంచ్ స్థానాలను బిజెపి కైవసం చేసుకుంటుందని బిజెపి మండల అధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్ అన్నారు.**



**బజార్హత్నూర్,డిసెంబర్2(డిడి9వార్త):-** బజార్ హత్నూర్ మండలంలో మంగళవారం స్థానిక ఎన్నికల పై బిజెపి పదాధికారుల సమా వేశం తిరుమల గార్డెన్లో నిర్వహించారు.వార్డు సభ్యులతో సహ బజార్హత్నూర్మండలంలో అన్ని సర్పంచ్ స్థానాలను గెలుపే లక్ష్యంగా పార్టీ ముందుకుసాగుతుందని,ప్రతీకార్యకర్త,నాయకులు అందుకు తగినట్లుగా క ృషి చేయాలని తెలిపారు.ఈసమావేశంలో బజార్ హత్నూర్ మండల కేంద్రం యువ నాయకుడు సిడాం వికాస్ బిజెపి కండువా కప్పుకుని పార్టీలోచేరారు.కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల అభివ ృద్ధి జరుగుతుందని, కేంద్ర ప్రభుత్వ పథకాలు, బిజెపి చేస్తున్న అభివ ృద్ధికి ఆకర్షితమై తాను బిజెపి లో చేరానని వికాస్ తెలిపారు.ఈ కార్యక్రమంలో నానం రమణ,కొత్త శంకర్, రాకేష్, రాజన్న, సూది నంది నర్సయ్య,సూది వినాయక్, చట్లసుఖదేవ్, ఏ.గణేష్,బలి రామ్,మారుతీ, మహేష్, శ్రీనివాస్ పలువురు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గుట్కా, పాన్ మసాలా పరిశ్రమపై కేంద్రం కొరడా రాబోతున్న కొత్త చట్టం

**- గుట్కా, పాన్ మసాలా పరిశ్రమపై కొత్త చట్టం తెస్తున్న కేంద్రం**



**బోథ్, డిసెంబర్ 2(డిడి9వార్త):-** ఉత్పత్తి పై కాకుండా యంత్రాల సామర్థ్యం ఆధారంగా పన్ను విధింపు.నిబంధనలు ఉల్లంఘిస్తే ఐదేళ్ల జైలు శిక్ష, భారీ జరిమా నాలు.సిగరెట్ల పై కూడా సెస్సు విధానంలో కీలక మార్పులకు సన్నాహాలు.దేశంలో పెద్దగా నియంత్రణ లేని గుట్కా, పాన్ మసాలా పరిశ్రమను కట్టడి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక కీలక చట్టాన్ని తీసుకురాబోతోంది. 'హెల్త్ సెక్యూరిటీ టు నేషనల్ సెక్యూరిటీ సెస్ బిల్, 2025' పేరుతో రూపొందించిన ఈ బిల్లును ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నారు.ఈ కొత్త చట్టం ప్రకారం, గుట్కా, పాన్ మసాలా వంటి పొగాకు ఉత్పత్తులపై పన్ను విధించే విధానం పూర్తిగా మారనుంది. ఇప్పటివరకు తుది ఉత్పత్తి ఆధారంగా పన్ను విధిస్తుండగా, ఇకపై వాటి తయారీకి ఉపయోగించే యంత్రాల ఉత్పత్తి సామర్థ్యం ఆధారంగా ప్రత్యేక సెస్సువిధించనున్నారు. చేతితో తయారుచేసే యూనిట్లకు కూడా ప్రతినెలా తప్పనిసరిగా నిర్దిష్ట మొత్తంలో సెస్సు చెల్లించాల్సి ఉంటుంది.నిబంధనలు కఠినతరంఈ కొత్త విధానంలో, ఉత్పత్తి ఎంత జరిగిందనే దానితో సంబంధం లేకుండా ప్రతి నెలా తయారీదారులు సెస్సు చెల్లించాలి. ఒకవేళ యంత్రాలు లేదా యూనిట్ 15 రోజులకు మించి పనిచేయకపోతే మాత్రమే మిన హాయింపు లభిస్తుంది. ప్రతి తయారీదారు తప్పనిసరిగా ప్రభుత్వంతో రిజిస్టర్ చేసుకోవాలి, నెలవారీ రిటర్న్లు దాఖలు చేయాలి. అధికారులు ఎప్పుడైనా తనిఖీలు, విచారణ, ఆడిట్ చేసేందుకు వీలు కల్పించాలి. ఈ నిబంధనల ఉల్లంఘనకు ఐదేళ్ల వరకు జైలు శిక్ష, భారీ జరిమానాలు విధించేలా బిల్లులో ప్రతిపాదనలు ఉన్నాయి. అవసరమైతే సెస్సును రెట్టింపు చేసే అధికారాన్ని కూడా ప్రభుత్వం తన వద్దే ఉంచుకోనుంది.ధరలపై ప్రభావం ఉండదుమరోవైపు, సిగరెట్లపై ఉన్న జీఎస్టీ పరిహార సెస్సును కూడా కేంద్ర ఎక్సైజ్ చట్టం పరిధిలోకి మారుస్తూ మరో బిల్లును ప్రభుత్వం ప్రవేశపెడుతోంది. అయితే, ఈ మార్పుల వల్ల గుట్కా, పాన్ మసాలా లేదా సిగరెట్ల ధరలపై వినియోగదారులపై ఎలాంటి అదనపు భారం పడదని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న పన్ను రేట్లలో ఎటువంటి మార్పు ఉండదని, కేవలం పన్నుల వసూలు విధానాన్ని క్రమబద్ధీకరించి, పారదర్శకత పెంచడమే లక్ష్యమని వివరించారు.

# తెలంగాణ రాజ్ భవన్ పేరు మార్పు!




**హైదరాబాద్:డిసెంబర్ 02(డిడి9వార్త):-** తెలంగాణ రాజ్ భవన్ పేరు మారుస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది,రాజ్ భవన్ పేరు లోక్ భవన్ గా పేరు మార్చింది, గవర్నర్ల అధికారిక నివాసాలకు పేరు మార్చాలని కేంద్రం రాష్ట్రాల కు సూచించిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ఇవ్వా ళ ఈ నిర?యం తీసుకుంది.. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నేత ృత్వంలోని ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పలు కీలక నిర?యాలు తీసుకుంటూనే ఉంది.అందులో భాగంగా.. గవర్న ర్‌ల అధికారిక నివాసాలైన రాజ్ భవన్ పేర్లను ఇకపై లోక్ భవన్‌గా పిలవనున్నా రు..ప్రజా సేవ' అనే ప్రభుత్వ నినాదానికి అనుగుణంగా ఈ మార్పు చేయాలని కేంద్రం నిర?యించుకుంది.. దీనికి అనుగుణంగా.. కేంద్ర హెూం శాఖ కీలక ప్రకటన చేసింది.దేశవ్యాప్తంగా గవర్నర్ల అధికారిక నివాసం, కార్యాలయ భవనంగా ఉన్న 'రాజ్ భవన్' పేరును 'లోక్ భవన్'గా మార్పు చేస్తున్నట్లు గత నెల 25వ తేదీన జారీ చేసిన అధికారిక ఉత్తర్వుల్లో పేర్కొంది.. దేశంలో ఎక్కడా 'రాజ్ భవన్' అనే పదం అధికారికంగా ఉపయో గించరాదని కేంద్రప్రభుత్వం స్పష్టం చేసింది. రాజ్యాంగంలో గవర్నర్ పదవి రాజన్యతకు ప్రతీక కాదని, ప్రజల ప్రతినిధిగా పనిచేసే వ్యవస్థ అనే ఉద్దేశంతో 'లోక్ భవన్' అంటే.. ప్రజల భవనం గా కొత్త పేరును ఎంచుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి ఈ మార్పు ద్వారా రాజ్యాం గ గణతంత్ర విలువలను మరింత బలపరుస్తున్నట్లు పేర్కొంటున్నారు..


# సాలూర మండలంలో ఎస్ఎస్‌టి, ఫ్లయింగ్ స్క్వాడ్స్ కట్టుదిట్టమైన తనిఖీలు





**బోధన్, నిజామాబాద్ జిల్లా, డిసెంబర్ 02,(డీడీ9 వార్త) :** రెండవ సాధారణ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎన్నికల యంత్రాంగం పర్యవేక్షణను మరింత కఠినతరం చేసింది. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు, అక్రమ డబ్బు ప్రవాహం, మద్యం రవాణా వంటి అంశాలను అరికట్టేందుకు ప్రత్యేక బ ృందాలు చోటు చేసుకొని విస్తృత తనిఖీలు చేపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎస్ఎస్‌టి (స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్) బ ృందం సాలూర అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద ఉదయం నుండి రాత్రివేళల వరకు వాహనాలపై వరుస తనిఖీలు నిర్వహించింది. రాష్ట్ర సరిహద్దు దాటే ప్రతి వాహనాన్ని ఆపి డ్రైవర్ వివరాలు, సరుకు పత్రాలు, ప్రయాణ ఉద్దేశ్యాన్ని ఖచ్చితంగా పరిశీలించారు. అనుమానాస్పదంగా కనిపించిన కొన్ని వాహనాలను ఆపి పూర్తి స్థాయి తనిఖీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల సమయంలో సరిహద్దు చెక్‌పోస్టులు అత్యంత కీలకమని, ఎలాంటి అక్రమ రవాణాకు అవకాశం ఇవ్వబోమని అధికారులు స్పష్టం చేశారు. ఇదే సమయంలో, ఫ్లయింగ్ స్క్వాడ్స్ కూడా సాలూరు క్యాంప్ ప్రాంతంలో ఆకస్మిక దాడులు, స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాయి. లోకల్ రోడ్లు, పట్టణ ప్రధాన వీధులు, బైపాస్ మార్గాల్లో అనుమానాస్పదంగా సంచరించే వాహనాలను ఆపి తనిఖీలు చేపట్టారు. ఎన్నికలకు సంబంధించిన ఏవైనా ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి సంబంధిత ప్రాంతాలకు చేరుకుని పరిశీలించేందుకు ప్రత్యేక బ ృందాలు సిద్ధంగా ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు.ఎన్నికల సమయంలో పారదర్శకత, సమగ్రత, శాంతిభద్రతలు కాపాడటం తమ ప్రధాన లక్ష్యమని ఎస్ఎస్‌టి మరియు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల తెలిపారు. ఈ తనిఖీలలో అధికారులు రఫీఖ్వర్, ముఖీమ్, శ్వేత, విట్టల్, రామస్వామి, తదితరులు ఉన్నారు.

# మార్చి 16 నుంచి 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు!



**హైదరాబాద్:డిసెంబర్ 02(డిడి9వార్త):-** తెలంగాణ రాష్ట్రంలో 2026 సంవత్సరం 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 16 నుంచి నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతుంది. మార్చి 13తో ఇంటర్మీడియ ట్ పరీక్షలు ముగియనున్న నేపథ్యంలో వెంటనే పదవ తరగతి పరీక్షలు చేపట్టేలా అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించారు. దీంతో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు–2026ను మార్చి 16న ప్రారంభించే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది....స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ పలు వెర్షన్ లలో పరీక్ష టైమ్‌టేబుల్ సిద్ధం చేస్తుండడం వల్ల అధికారిక తేదీలు ప్రకటించడంలో ఆలస్యం జరుగుతోంది.ఈ సంవత్సరం ప్రభుత్వం కొత్త విధానాన్ని పరిశీలిస్తోంది. ప్రతి పరీక్ష మధ్య ఒకటి లేదా రెండు రోజుల విరా మం ఇవ్వడం, సీబీఎస్ఈ విధానంలా నిర్వహించడం వంటివాటిని పరిశీలిస్తోంది. ఇది గత సంవత్సరాలతో పోల్చితే పెద్ద మార్పే. ఎందు కంటే అప్పట్లో పలు పరీక్ష లు వరుసగా జరిగేవి. నిపుణుల సూచనలు, విద్యార్థుల స్ట్రెస్ విశ్లేషణ ఆధారంగా పరీక్షల మధ్య విరామం ఇవ్వాలని అధికారులు భావిస్తున్నారు. దీంతో విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవ్వడానికి సహాయ పడుతుందని ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ భావిస్తోంది.పరీక్ష షెడ్యూల్‌ను కొంచెం పొడిగించడం వల్ల విద్యార్థుల ఆందోళన తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు. ప్రతి సబ్జెక్ట్ కు రివిజన్‌కు సమయం దొరికేలా చేస్తుందని చెబుతున్నారు.మరోవైపు, ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్మీడియట్ ఎగ్జామ్స్ ప్రారంభం అవుతాయి. మార్చి13న ఇంటర్ మెయిన్ సబ్జెక్టుల పరీక్షలు పూర్తవుతాయి. ఆ తర్వాత రెండు రోజుల విరామం ఇచ్చి మార్చి16 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభిం చాలని అధికారులు ప్రణాళికలు వేసుకున్నారు.అదే నెలలో ఉగాదితో పాటు శ్రీరామనవమి, రంజాన్, మహావీర్ జయంతి వంటి పండుగలువస్తున్నాయి. దీంతో ఆ సమయాల్లో సెలవులు ఇస్తే విద్యార్థులు చదువుకునేం దుకు వీలుంటుందన ఆ మేరకు పరీక్షల టైమ్ టేబుల్‌ను రూపొందించి నట్లు తెలుస్తోంది

బుధవారం
డిసెంబర్ 03 2025
DD9 వార్త
4

## సర్పంచ్ ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కకార్యకర్త పని చేయాలి

**- ఆదిలాబాద్ జిల్లా బిజెపి అధ్యక్షులు పతంగే బ్రహ్మానంద్.**



**ఇచ్చోడ, డిసెంబర్ 2(డిడి9వార్త):-** ఇచ్చోడ మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మంగళవారం రోజు బిజెపి కార్యకర్తలు సమావేశం అయ్యారు. ఈ స్థానిక ఎన్నికలలో సర్పంచ్ వార్డ్ సభ్యులు బిజెపి బలపరిచిన అభ్యర్థి గెలుపు కోసం ప్రతి ఒక్కకార్యకర్త కలిసికట్టుగా పని చేయాలని ఆదిలాబాద్ బిజెపి అధ్యక్షులు పతంగే బ్రహ్మానంద్ తెలిపారు.ప్రతి ఓటరుకు కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరిస్తూ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తహరే రమేష్, నాయకులు భీమ్ రెడ్డి,కొల్లూరి శేఖర్,పాండురంగ్,కేంద్రే నారాయణ్,బాబ్జీ కేంద్రె, బిజెపి మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 9 ఆదివాసి పోరు గర్జన సభ వాయిదా

**- పంచాయితీ ఎన్నికల కోడ్ దృష్ట్యా తాత్కాలిక వాయిదా వేస్తున్నట్లు ప్రకటించిన తుడుందెబ్బ నాయకులు**

**- కుమ్రం భీం జిల్లా ఎస్పీ ఐపీఎస్ నితీఖ పంత్ కు వాయిదా తీర్మానాన్ని అందించిన భీం జిల్లా తుడుందెబ్బ జనరల్ సెక్రటరీ పెందోర్ మారుతి.**



**బోథ్, డిసెంబర్ 2(డిడి9వార్త):-** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో డిసెంబర్ 9 ఆదివాసి పోరు గర్జన సభ అనుమతిని కోరుతూ వారం రోజుల క్రితమే ఆ జిల్లా ఎస్ పి నితిక పంత్ కి వినతి పత్రాన్ని అందించిన విషయం విధితమే. కానీ, ప్రస్తుతం పంచాయితీ ఎన్నికల కోడ్ దృష్ట్యా సభ వాయిదా వేయమని సంబంధిత అధికారులు కోరిక మేరకు తుడుందెబ్బ నాయకత్వము చర్చించి ఆదివాసి పోరు గర్జన భారీ బహిరంగ సభను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ఈ విషయం పై తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పెందోర్ మారుతీ,కుంరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కార్యాలయానికి వెళ్లి ఎస్పీ నితిఖ పంత్ ని కలసి లిఖిత పూర్వకంగా పత్రం ఇచ్చి తాత్కాలిక%శ్%గా వాయిదా వేస్తున్నట్లు చేసిన తీర్మానాన్ని అందజేశారు.త్వరలోనే ఆదివాసి పోరు గర్జన భారీ బహిరంగ సభ తేదీని తిరిగి తెలుపుతామని ఆయన తెలిపారు.

## క్యాన్సర్కు ట్రీట్మెంట్.గెలిచిన వృద్ధుడు!



**(డిడి9వార్త):-** జర్మనీకి చెందిన 61 ఏళ్ల వ్యక్తి రికార్డు సృష్టించారు.ప్రపంచంలో ఇప్పటి వరకు నలుగు పూర్తిగా కోలుకున్న ఏడవ వ్యక్తిగా గుర్తింపు పొందారు.బ్లడ్ క్యాన్సర్ చికిత్సలో భాగంగా జరిగిన కీమోథెరపీ.. పాత ఇమ్యూన్ సెల్స్తో పాటు కణాలను కూడా నాశనం చేసినట్టు శాస్త్రవేత్తలు తెలిపారు. రెసిస్టెంట్ స్టెమ్ సెల్స్ లేకుండానే కోలుకున్న రెండో వ్యక్తిగానూ ఇతను నిలిచారు. ప్రస్తుతం అతను పూర్తి ఆరోగ్యంగా ఉన్నారు.

## బిజెపి జాతీయ అధ్యక్షునికి జన్మదిన శుభాకాంక్షలు తెల్పిన ఆదిలాబాద్ ఎంపీ జి నగేష్.



**బజార్ హత్నూర్, డిసెంబర్ 2(డిడి9వార్త):-** బిజెపి జాతీయ అధ్యక్షులు, కేంద్ర ప్రభుత్వం లో ఆరోగ్య %a%కుటుంబ, ఎరువులు రసా యనాల శాఖ మంత్రి జన జె పి నడ్డా మంగళవారం రోజు ఆయన జన్మదినమును ఘనంగా జరుపుకున్నారు.ఈ మేరకు తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ ఆయనను కల్సి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.శాలువా కప్పి హర్షం వ్యక్తం చేశారు.

# హరీష్ రావు చేతిలోకి బీజేపీ సామ రామ్మోహన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు!

**హైదరాబాద్, 2 డిసెంబర్:** తెలంగాణ రాజకీయాల్లో త్వరలో సంచలనం జరగబోతుందని టీపీసీసీ మీడియా అండ్ కమ్యూనికేషన్స్ ఛైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు చేతిలోకి తెలంగాణ బీజేపీ రిమోట్ కంట్రోల్ వెళ్లిపోయిందని సంచలన ఆరోపణలు చేశారు. హరీష్ రావు చేతిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, బీజేఎల్పీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి కీలు బొమ్మల్లా మారిపోయారని అన్నారు. ఇక నుంచి హరీష్ కార్యక్రమాలను కేటీఆర్ కంటే ఎక్కువగా ప్రచారం వచ్చే విధంగా బీజేపీ రాష్ట్ర నాయకత్వం ప్రణాళిక చేస్తోందని చెందారు. తెలంగాణ రాజకీయాల్లో ఇద్దరు కీలక నేతలు.. హరీష్ రావు, ఈటల రాజేందర్ వ్యూహంలో ఇప్పుడు బీజేపీ చిక్కిందని అన్నారు. ప్రస్తుతం సామ చేసిన ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో హీట్ పెంచింది. మరోసారి హరీష్



రావు బీజేపీ తీర్థం పుచ్చుకుంటారనే వార్తలకు ఆద్యం పోసినట్టయింది.గులాబీ గూటి నుంచి.హరీష్ రావు బీజేపీలో చేరుతారంటూ వస్తున్న వార్తలు కొత్తేమి కాదు. గతంలో కూడా హరీష్ గులాబీ గూటి నుంచి ఎగిరిపోయి కాషాయ జెండా కప్పుకుంటున్నారని అనేక వార్తలు వచ్చాయి. ఈ వార్తలపై హరీష్ రావు పలుమార్లు స్పందించారు. ఆ వార్తలను ఖండించారు. తాను రాజకీయాల్లో ఉన్నంత వరకు బీఆర్ఎస్ పార్టీలోనే ఉంటానని క్లారిటీ ఇచ్చారు. అయితే ఇటీవల బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయబడ్డ ఎమ్మెల్సీ కవిత హరీష్ రావుపై సంచలన ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. హరీష్ రావుతో జాగ్రత్తగా ఉండాలని కేసీఆర్, కేటీఆర్ లకు కవిత సూచనలు చేశారు. కాగా కవిత కూడా హరీష్ రావు బీజేపీ నేతలతో టచ్ లో ఉన్నారని పరోక్షంగా హింట్ ఇచ్చిన విషయం తెలిసిందే. మరి త్వరలో తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిమాణాలు జరుగుతాయని సామ రామ్మోహన్ రెడ్డి చేసిన ట్వీట్ నిజమవుతుందా? లేదా? అనేది వేచి చూడాలి.

# మంత్రిగా చెబుతున్నా ఒక్క థియేటర్‌లోనూ పవన్ సినిమా రిలీజ్ కాదు

**హైదరాబాద్, 2 డిసెంబర్:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇటీవల చేసిన 'కోనసీమ కామెంట్స్' తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపాయి. గోదావరి జిల్లాలు మొత్తం పచ్చదనంతో అందంగా ఉంటాయని.. కోనసీమలో కొబ్బరి చెట్లు ఎండి పోవడానికి తెలంగాణ ప్రజల దిష్టి తగలడమే కారణమంటూ పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యమెంట్స్‌పై తెలంగాణ మంత్రులు, నాయకులు తీవ్రంగా స్పందించారు. తాజాగా.. తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పవన్ కల్యాణ్‌పై తీవ్రస్థాయిలో ఫైరయ్యారు. పవన్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.అసలు వివాదంలోకి వెళితే.. ఇటీవల పవన్ కోనసీమ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భ ంగా కొబ్బరి తోటలు ఎండిపోతున్న దుస్థితిని ప్రస్తావిస్తూ.. 'కోనసీమ కొబ్బరి తోటలకు తెలంగాణ వాళ్ల దిష్టి తగిలింది' అంటూ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల తో పాటు రాజకీయ వర్గాల్లోనూ తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. తెలంగాణ ప్రజలను



ఉద్దేశించి చేసిన ఈ వ్యాఖ్యలపై రాష్ట్రవ్యా ప్తంగా నిరసన వ్యక్తమైంది. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా పవన్ మాట్లాడారనే విమర్శలు వచ్చాయి.పవన్ వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తాజాగా తీవ్రంగా స్పందించారు. పవన్ కల్యాణ్‌కు మంత్రిగా వార్నింగ్ ఇచ్చారు. తెలంగాణ ప్రజలకు పవన్ కల్యాణ్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని.. లేదంటే పవన్ కల్యాణ్ నటించిన ఒక్క సినిమా కూడా తెలంగాణలోని ఒక్క థియేటర్‌లో కూడా విడుదల కానివ్వనని హెచ్చరించారు. కోనసీమ కొబ్బరి చెట్లకు తెలంగాణ ప్రజల దిష్టి తగల లేదని.. ఆంధ్ర పాలకుల నిర్లక్ష్యం వల్లే తెలంగాణ ప్రజలు ఫ్లోరైడ్ విషం నీటిని తాగారన్నారు. దశాబ్దాల పాటు తెలంగాణ వెనుకబాటుకు కారణమైన ఆంధ్ర పాలకులను ప్రశ్నించకుండా.. తెలంగాణ ప్రజలపై నిందలు వేయడం సరికాదని ఘాటుగా విమర్శించారు.మంత్రిగా పవన్ కల్యాణ్‌కు అనుభవం లేకపోవడం వల్లే ఇటువంటి అపరిపక్వ వ్యాఖ్యలు చేస్తున్నారని కోమటిరెడ్డి విమర్శించారు. ఇక తెలంగాణ ప్రజల మనోభావాలను గాయపరిచేలా మాట్లాడిన పవన్ క్షమాపణ చెప్పాల్సిందేనని బీఆర్ఎస్‌తో సహా ఇతర పార్టీల నాయకులు కూడా డిమాండ్ చేస్తున్నారు. ఈ వివాదం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య రాజకీయ సంబంధాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# పంతం నెగ్గించుకున్న రాజగోపాల్ రెడ్డి ఊరి బయటే మద్యం దుకాణాలు

**మునుగోడు :** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.. నిత్యం ఏదో ఒక అంశం మీద స్పందిస్తూ వార్తల్లో నిలుస్తుం టారు. ఈక్ర మంలో గతంలో మద్యం దుకాణాల టెండర్ల ప్రక్రియ సంద ర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. వైన్ షాపులు దక్కించుకున్న వారు.. గ్రామానికి చివర మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలని.. అలానే ఉదయం నుంచే వైన్స్ తెరవద్దని.. మధ్యాహ్నం ఒంటి గంట తర్వాతే మద్యం అమ్మకాలు ప్రారంభించాలని సూచి ంచారు. దీనితో పాటుగా.. అసలు పర్మిట్ రూములకు అనుమతి ఇవ్వొద్దని.. ఒకవేళ ఇవ్వా ల్సి వస్తే.. సాయంత్రం ఆరు గంటల తర్వాతే వాటిల్లోకి అనుమతివ్వాలని సూచించిన సంగతి తెలిసి ందే. దీనిపై అప్పట్లో పెద్ద గందరగోళమే చెలరేగింది. కానీ ఈ అంశంలో రాజగోపాల్ రెడ్డి తన మాట నెగ్గించుకున్నారు. మద్యం షాపుల నిర్వహణలో ఆయన సూచనలు అమలు చేస్తున్నారు దుకాణాదారులు. మునుగోడు నియోజకవర్గంలో మద్యం దుకాణాలు దక్కించుకున్న వైన్స్ యజమానులు.. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



సూచన మేరకు ఊరి బయటే మద్యం దుకాణాలను ఏర్పాటు చేశారు. అలానే ప్రతి రోజు మధ్యాహ్నం ఒంటిగంట తర్వాతే మద్యం విక్రయాలు మొదలుపెడుతున్నారు. సాయంత్రం 6 గంటలకు పర్మిట్‌రూంలోకి అనుమతి ఇస్తున్నారు. దీంతో ఎమ్మెల్యే రాజగో పాల్ రెడ్డి తన మాట నెగ్గించుకున్నారని కామెంట్ చేస్తున్నారు స్థానికులు. అన్ని గ్రామాల్లో ఇదే అనుసరిస్తే.. చాలా బాగుం టుందని అభిప్రాయపడుతున్నారు.మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునే సమయంలోనే ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి.. మునుగోడు నియోజకవర్గంలోని మద్యం దుకాణాల యజమానులతో కీలక భేటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మద్యం షాపు ఓన ర్స్‌కు కీలక సూచనలు చేశారు. బెల్ట్ షాపులు నిర్వహించొద్దని, సిండికేట్ ఏర్పడకూడదని.. ఊరి చివరే మద్యం అమ్మకా లు జరపాలని.. అలానే పర్మిట్‌రూంలకు పర్మిషన్ ఇవ్వొద్దని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి వారికి సూచించిన సంగతి తెలిసిందే.అనంతరం మద్యం దుకాణాలు దక్కించుకున్న యజమానులతో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి.. హైదరాబాద్‌లోని తన నివాసంలో ప్రత్యేక భేటీ నిర్వహించారు. ఆయన పెట్టిన కండీషన్లకు మద్యం దుకాణాదారులు, వ్యాపారులు ఆమోదం తెలిపారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఊరి బయటే మద్యం షాపులను ఏర్పాటు చేయగా.. తాజాగా సోమవారం వాటిని ప్రారంభించారు. అలానే ఎమ్మెల్యే సూచించనట్లుగానే మధ్యాహ్నం ఒంటి గంట తర్వాతనే మద్యం విక్రయాలు ప్రారంభించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# రాష్ట్రంలోని ఆ 5 పంచాయతీలు, 133 వార్డుల్లో సర్పంచ్ ఎన్నికలు లేనట్లే

**హైదరాబాద్, 2 డిసెంబర్:** తెలంగాణ పంచాయతీ ఎన్నికల హాడావుడి మొదలైంది. ఈక్రమ ంలో తొలి విడత పంచాయతీలకు సంబంధించి నామినేషన్ల పర్వం ముగిసింది. ఇక తొలి విడతలో భాగంగా 4,236 పంచా యతీలు, 37, 179 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. వీటికి సంబంధించి నామినేషన్ల పర్వ ముగిసింది. ఈ క్రమంలో తొలి విడతలో భాగంగా 5 పంచాయతీలకు, 133 వార్డులకు ఎన్నికలు జరిగే అవకాశం లేదని తెలుస్తోంది. కారణం ఇక్కడ నామినేషన్లు వేయలేదు.తొలి విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక వివరాలు వెల్లడించింది. తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో 5 సర్పంచ్ స్థానాలకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని ఎస్ఈసీ తెలిపింది. అలాగే 133 వార్డుల్లోనూ పోటీకి ఎవరూ ముందుకు రాలేదని.. ఒక్క నామినేషన్ దాఖలు కాలేదని అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని మొత్తం 37, 440 వార్డులకు గాను 133 మినహా మిగతా 37,179 స్థానాలకు.. 85,428 మంది నామి నేషన్లు



వేశారుతొలి విడత పంచాయతీ ఎన్నికల్లో 4,236 పంచా యతీల్లో.. 5 మినహా మిగతా 4,231 సర్పంచ్ స్థానాలకు గాను 22,330 మంది నామినేషన్లు వేశారు. ఇదిలా ఉంటే.. 129 సర్పంచ్ స్థానాలకు ఒక్కొక్కరే నామినేషన్లు వేయడంతో అవి ఏకగ్రీవం కానున్నాయి. నామినేషన్ల పరిశీలన పూర్తయిన తర్వాత ఈ వివరాలను ఎన్నికల సంఘం ప్రకటించింది.ఈ నెల 3వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరించుకోవడానికి గడువు ఉంది. అలానే రెండో విడత ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. మంగళవారంతో ఈ గడువు ముగియనుంది. ఇక తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో 129 సర్పంచి స్థానాలకు ఒక్కొక్కరే నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల ఉపసంహరణ తర్వాత ఏకగ్రీవాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు అధికారులు.సర్పంచ్ పదవికి ఒకే ఒక్క నామినేషన్ దాఖలైన పంచాయతీల విషయానికి వస్తే.. ఆదిలాబాద్ జిల్లా అత్యధిక ఏకగ్రీవాలతో ప్రథమ స్థానంలో ఉంది. ఆదిలాబాద్ జిల్లాలో ఏకంగా 30 చోట్ల ఒక్కొక్కరే నామినేషన్లు వేశారు. ఆ తర్వాత స్థానాల్లో వికారాబాద్ (16), నిర్మల్ (9), కుమురం భీం ఆసిఫాబాద్, మెదక్, నారాయణపేట, సిద్దిపేట, నిజామాబాద్ 6 చొప్పున ఉన్నాయి. ఇక కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, జనగామ జిల్లాల్లో 5 చొప్పున ఏకగ్రీవం అయ్యాయి. ఆ తర్వాత ఖమ్మం, రంగారెడ్డి (4), నాగర్ కర్నూల్, భద్రాద్రి కొత్తగూడెం, వనపర్తి (3), వరంగల్, మంచిర్యాల, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, (2), ఉమ్మడి వరంగల్‌లోని గ్రామాలు, జగిత్యాల‌కొక్కటి చొప్పున ఏకగ్రీవం అయ్యాయి.

# ఆర్టీసీకి చెల్లించాల్సిన 2072 కోట్లు తక్షణమే చెల్లించాలి

ఆర్టీసీని కాంగ్రెస్ ప్రభుత్వం మరింత అప్పుల ఊబిలోకి నెట్టివేస్తోందని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాబు, ఈదురు వెంకన్న ఆరోపించారు. మహాలక్ష్మీ పథకంలో భాగంగా జారీ చేసిన జీరో టికెట్లకు సంబంధించి ప్రతి నెల రూ.350 కోట్లు ఆర్టీసీకి చెల్లిస్తామని హామీ ఇచ్చి, ప్రతి నెల అరకొర నిధులను విడుదల చేస్తున్నారని మండిపడ్డారు.ఆర్టీసీలో రెండేండ్లుగా మహాలక్ష్మీ పథకం విజయవంతంగా అమలు జరుగుతోందని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలిపారు. దీనికి సంబంధించి ఆర్టీసీకి రాష్ట్ర ప్రభుత్వం రూ. 8,700 కోట్లు ఇవ్వాల్సి ఉండగా, కేవలం 6,620 కోట్లే విడుదల చేసి మొత్తం చెల్లించినట్లుగా ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని విమర్శించారు. కానీ ఆర్టీసీకి చెల్లించాల్సిన సొమ్ము సుమారు 2,072 కోట్లు ఇవ్వకుండా, ఆ భారాన్ని ఆర్టీసీ మీదనే ప్రభుత్వం రుద్ది చేతులు దులుపుకోవడం సమంజసం కాదని అన్నారు.



అలాగే ఆర్టీసీ ఉద్యోగులకు చెల్లించాల్సిన 2017 వేతన సవరణ బకాయిలు.. 2021, 2025 వేతన సవరణలు అమలుకు నోచుకోవడం లేదని తెలిపారు. ఆర్టీసీకి బకాయి పడ్డ డబ్బులను వెంటనే విడుదల చేసి ఇచ్చిన మాట నిలుపుకోవాలని కోరారు.మహాలక్ష్మి పథకం అమలు సజావుగా అవుతున్నదని సంబరాలు చేసుకుంటున్న ప్రభుత్వం.. పథకానికి అవసరమయ్యే బస్సులను సమకూర్చడంలో, సిబ్బందిని నియమించడంలో, ఈ పథకం వల్ల ఎదురయ్యే ఇబ్బందులను నివారించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఆర్టీసీలో రిటైర్ అయిన ఉద్యోగులు క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీలో పొదుపు చేసుకున్న మొత్తాలకు చెల్లించాల్సిన వడ్డీ 15 నెలలుగా చెల్లించకపోవడం వలన కార్మికులు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆర్టీసీపై సవతి ప్రేమను విడనాడి తక్షణమే 2,072 కోట్ల రూపాయలను విడుదల చేసి ప్రభుత్వం చిత్తశుద్ధి చాటుకోవాలన్నారు.

# పరిశ్రమల సృష్టికర్త చంద్రబాబు



**అనంతపురం:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిశ్రమల సృష్టికర్త అని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. రొద్దం మండలంలోని సానిపల్లిలో వ ృద్ధులు, వికలాంగులకు ఇంటింటికి వెళ్లి పింఛన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాటా డుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతినెలా ఇంటివద్దకే వెళ్లి పింఛన్లు అందిస్తు న్నామని పేర్కొన్నారు. కియా లాంటి పరిశ్రమలో వేలాది మంది నిరుద్యోగులు ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ఎంఎసఎంఈలతో రాష్ట్రానికి కుప్పలు తెప్పలుగా పరిశ్రమలు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పాల్గొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు మంజూరు చేస్తామనీ మంత్రి సవిత అన్నారు. సోమవారం రొద్దంలోని వెలుగు కార్యాలయంలో డివిజన్‌స్థాయి ఫిర్యాదుల దినోత్సవం నిర్వహించారు. ప్రజా సమస్యలపై వందలాది మంది తరలిరాగా మంత్రి ప్రతి ఒక్కరి సమస్య వింటూ సంబంధిత శాఖాధికారులతో సమస్యకు పరిష్కారం చూపారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, తహసీల్దార్ ఉదయశంకర్‌రాజు, ఎంపీడీఓ ఆనంద్ ప్రసాద్, టీడీపీ నాయకులు మాధవనాయుడు, వెంకటరామిరెడ్డి, వీరాంజనేయులు, హరీష్, పవన్, శ్రీనాథ్‌చౌదరి, అరుణ్‌కుమార్ రెడ్డి, అశ్వత్థనారాయణ, తిరుపాల్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# రాజధానిలో రెండో విడత భూ సమీకరణకు ఆదేశాలు జారీ



**అమరావతి, డిసెంబర్ 02:** రాజధాని అమరావతి నిర్మాణానికి సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. రాజధాని అభివృద్ధి కోసం రెండో విడత భూ సమీకరణ చేపట్టే ందుకు ప్రభుత్వం ఇప్పటికే అనువ ంతించింది. అందుకు సంబంధించిన ఆదేశాలను మంగళవారం పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ జారీ చేశారు. ఏడు గ్రామాల్లో మొత్తం 16,666.57 ఎకరాల పట్టా, అసైన్డ్ భూమి సమీకరణ బాధ్యతను సీఆర్డీఏకు అప్పగిస్తున్నట్లు ఆ ఆదేశాల్లో స్పష్టం చేశారు.పల్నాడు జిల్లా అమరావతి మండలంలోని నాలుగు గ్రామాల పరిధిలో.. వైకుంఠపురంలో 1,965 ఎకరాలు,పెదమద్దూరులో 1,018 ఎకరాల పట్టా, యండ్రాయి గ్రామ పరిధిలో 1,879 ఎకరాలు పట్టా, 46 ఎకరాల అసైన్డ్ భూమితోపాటు కర్లపూడి, లేమల్లే 2,603 ఎకరాలు పట్టా భూమి, 51 ఎకరాల అసైన్డ్ భూమి సమీకరించనుంది.ఇక గుంటూరు జిల్లాలోని తుళ్లూరు మండలంలోని 3 గ్రామాల పరిధిలో.. వడ్డమానులో 1,763.29 ఎకరాల పట్టా, 4.72 అసైన్డ్ భూమి.. హరిశ్చంద్రాపురంలో 1,448.09 ఎకరాలు పట్టా, 2.29 అసైన్డ్ భూమి.. పెదపరిమిలో 5,886.18 ఎకరాల పట్టా భూమి సమీకరణ చేపట్టాలని ఆ ఆదేశాల్లో స్పష్టం చేసింది. 7 గ్రామాల్లో కలిపి 16,562.52 ఎకరాల పట్టా భూములు, 104.01 ఎకరాల అసైన్డ్ భూమిని సమీకరించాలని సీఆర్ డీఏ కమిషనర్‌ను ఆదేశించింది. ఈ భూ సమీకరణలో 3828.30 ఎకరాలు ప్రభుత్వ భూమి కూడా ఉంది

# డ్రైవర్‌తో గొడవ స్కూల్ బస్సుకు నిప్పంటించిన క్లీనర్.



**ప్రకాశం జిల్లా :** అర్ధవీడు మండలంలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. స్కూల్ బస్సుపై క్లీనర్ పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటన అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. అర్ధవీడు మండలం పాపినేని పల్లిలో మంగళవారం ఉదయం ఈ ఘటన జరిగింది.మంగళవారం ఉదయం ఆ స్కూల్ బస్సును నడుపుతున్న డ్రైవర్, క్లీనర్ మధ్య ఏదో విషయమై గొడవ జరిగింది. దీంతో క్లీనర్ తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. పెట్రోల్ తీసుకొచ్చి బస్సుపై వేసి నిప్పంటించాడు. దీంతో బస్సు మంటల్లో చిక్కుకుని పూర్తిగా కాలిపోయింది. అప్పటికింకా పిల్లలెవరూ బస్సు ఎక్కకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ నభికి మంటలు అంటుకుని స్వల్పంగా గాయాలయ్యాయి . అతడిని స్థానికులు వెంటనే సమీపంలోని హాస్పిటల్‌కు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకున్నారు. పెట్రోల్ పోసి నిప్పంటించిన క్లీనర్ గోపాల్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# శ్రీశైలం టోల్‌గేట్ వద్ద రివాల్వర్ కలకలం పోలీసుల విచారణ



**నంద్యాల జిల్లా, డిసెంబర్ 02:** శ్రీశైలం టోల్‌గేట్() వద్ద రివాల్వర్ కలకలం రేపుతోంది. దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది వాహనాల తనిఖీలు చేపట్టగా.. ఓ వ్యక్తి నుంచి 9 ఎంఎం పిస్టల్(9ఒకటి బయటపడింది. దీంతో సదరు తుపాకీ()ని స్వాధీనం చేసుకున్న పోలీసులు.. విచారణ చేపట్టా రు.కాగా.. రివాల్వర్ తీసుకువచ్చిన వ్యక్తిని మధ్యప్రదేశ్‌వాసిగా గుర్తించారు శ్రీశైలం ఆలయ అధికా రులు. ఆ రాష్ట్రానికి చెందిన సైబర్ క్రైమ్ ఎస్ఐ(అని ఆయన పోలీసులకు చెప్పుకున్నట్టు తెలుస్తోం ది. అయితే.. ఈ ఘటనపై విచారణలో భాగంగా.. సదరు వ్యక్తి నుంచి రివాల్వర్ సహా ఐడెంటిటీ కార్డు(ను స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టినట్టు శ్రీశైలం సీఐ ప్రసాదరావు(పేర్కొన్నారు.

# మొంథా తుఫాన్ డ్యామేజ్ కేంద్రానికి నివేదిక సమర్పించిన మంత్రి లోకేష్, అనిత



**ఢిల్లీ:** ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న మంత్రులు లోకేష్, వంగలపూడి అనిత కేంద్ర హోంమంత్రి అమిత్ షా, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌లతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఏపీలో 'మొంథా' తుపాను సృష్టించిన బీభ త్సానికి వాటిల్లిన నష్టంపై నివేదిక సమర్పించారు. ఆంధ్రప్రదేశ్ కి తీవ్ర నష్టం మిగిల్చిన మొంథా తుపాను కారణ ంగా రాష్ట్రంలో అన్నిర ంగాలకు కలిపి రూ.6,352 కోట్ల మేర నష్టం వాటిల్లిం దని వారు కేంద్రమంత్రికి వివరించారు. తుపాను కారణంగా ప్రజలు తీవ్ర మైన ఇబ్బందులు ఎదుర్కొనడమే కాకుండా మౌలిక సదు పాయాలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నా యని చెప్పారు. మొంథా తుపాను వల్ల రాష్ట్రంలో మొత్తం 3,1 09 గ్రామాలు ప్రభా వితమయ్యాయని తెలిపారు. అక్టోబర్ 28వ తేదీ రాత్రి కాకినాడ సమీపంలో తుపాను తీరం దాటిందని.. ఆ సమయంలో గంటకు 100 కి.మీ. వేగంతో గాలులు భారీవర్షం కురవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెనువెంటనే అప్రమత్తమై 1.92 లక్షల మందిని 2,471 పునరావాస శిబిరాలకు తరలించింది. వారికి అవసరమైన ఆహారం, తాగునీరు, పాలు, ఇతర వస్తువులను అందించడంతో ప్రమాద తీవ్రతను తగ్గించినట్టు తెలిపారు.ప్రతి ప్రభావిత కుటుంబానికి తక్షణ సాయంగా రూ.3వేలు అందించామని.. ఇదే సమయంలో, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కూలిన చెట్ల తొలగింపు, తాత్కాలిక నివాస సౌకర్యాలు, నీటి సరఫరా పునరుద్ధరణ వంటి పలు చర్యలను చేపట్టిందని వివరించారు. తక్షణ సహాయం కింద రూ.60 కోట్ల రూపాయల ఆర్థిక సహాయం అందించినట్టు స్పష్టం చేశారు. మొత్తం మీద రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ, అనుబ ంధ రంగాలకు రూ.271 కోట్లు, గృహ నష్టం రూ.7 కోట్లు, రహదారులు, మౌలిక సదుపా యాలకు రూ.4,324 కోట్లు, విద్యుత్ రంగానికి రూ.41 కోట్లు, నీటి వనరులు, నీటిపారుదల ప్రాజెక్టులకు రూ.369 కోట్లు, శాశ్వత నిర్మా ణాలకు రూ.1,302 కోట్లు, సామూహిక ఆస్తుల కు రూ.48కోట్ల ఇలా మొత్తంగా రూ.6,356 కోట్ల నష్టం వాటిట్టు పేర్కొన్నారు. మార్గదర్శకాల ప్రకారం రూ.902 కోట్లు తక్షణ ఉపశమనం, తాత్కాలక పునరుద్ధరణ కోసం అర్హమైనవని.. ఈనెల 12వ తేదీన తాము సమర్పించిన నివేదికపై కేంద్రమంత్రుల బృందం () ద్వారా క్షేత్రస్థాయి పరిశీలన కూడా జరిపిందని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. అమిత్ షాను కలిసిన వారిలో హోం మంత్రి అనిత, రాష్ట్రానికి చెందిన ఎంపీలు ఉన్నారు.

# విశాఖపట్నంలో వెంటనే ఆ నిర్మాణాలను కూల్చేయండి




**విశాఖపట్నం:** పడింది. ఈ విషయాన్ని ఏపీ అపార్ట్‌మెంట్స్ చట్టంలోని సెక్షన్-9 స్పష్టం చేస్తోందని హైకోర్టు ప్రస్తావించిం ది.విశాఖపట్నం ఈస్ట్ పాయింట్ కాలనీలోని మాధురి మనోర్ అపార్ట్‌మెంట్ ఉంది. అయితే జీవీఎంసీ అధికారులు అక్కడ స్టిల్ట్ ఫ్లోర్‌లో అక్రమంగా నిర్మించిన షాపుల్ని కూల్చివేయాలని నోటీసులు జారీ చేశారు. జీవీఎంసీ ఈ నోటీసుల్ని పలువురు సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. తమ ఆరు షాపులు సెల్లార్/స్టిల్ట్ ఫ్లోర్‌లో ఉన్నాయని.. వాటికి తాము యజమా నులమని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆ షాపులను క్రమబద్ధీకరి ంచుకోవచ్చని ఏపీ మున్సిపల్ కార్పొరేషన్ చట్టం సెక్షన్ 455ఏ ప్రకారం కోర్టుకు వివరించారు. షాపులు క్రమబద్ధీకరి ంచేవడానికి దరఖాస్తు అధికారుల పరిశీలనలో ఉందన్నారు. కానీ కోర్టు మాత్రం వారి పిటిషన్‌ను కొట్టివేసింది.విశాఖపట్నం డబుల్ డెక్కర్ బస్సులు ఆ స్టాప్ వరకు పొడిగింపువిశాఖ గ్లాస్ బ్రిడ్జ్ ప్రారంభం.. ఫుల్ ధ్రిల్లింగ్ ఫ్లోర్‌లో షాపులు ఉన్నాయి.. 26 ఏళ్లుగా తమ ఆదీనంలో ఉన్నాయంటూ క్రమబద్ధీకరించాలని కోరడం సరికాదని హైకోర్టు తెలిపింది. ఇది చట్టబద్ధం కాదని.. జీవో 225 కూడా అనుమతించదన్నారు. సుప్రీం కోర్టు గతంలో ఇచ్చిన తీర్పు కూడా ప్రస్తావించారు. పార్కింగ్ ప్రాంతం అపార్ట్‌మెంట్ వాసుల అవసరాలకే ఉపయోగించాలని.. వాణిజ్య కార్యకలాపాలకు అమ్ముకోకూదని సుప్రీం కోర్టు స్పష్టంగా చెప్పిందని గుర్తు చేశారు. ఈ కేసులో అనధికార షాపుల్ని కూల్చివేయాలని హైకోర్టు అధికారుల్ని ఆదేశించింది. నాలుగు వారాల్లోగా ఆ ప్రాంతాన్ని పార్కింగ్‌కు వీలుగా మార్చేలా అప్పగించాలని ఆదేశించారు జస్టిస్ హరినాథ్. పిటిషనర్లు సమర్పించిన శాంక్షన్ ప్లాన్ నిజమైనది కాదని, వ్యాజ్యం దాఖలు చేసేందుకు అనువుగా దానిని తయారు చేశారని జీవీఎంసీ తరఫు లాయర్ కోర్టుకు తెలిపారు. ఫ్యాబ్రికేట్ చేసిన శాంక్షన్ ప్లాన్‌ను కోర్టుకు సమర్పించారని తప్పుపట్టారు.

# కూటమితోనే అభివృద్ధి



**శ్రీకాకుళం జిల్లా :** డబుల్ ఇంజన్ సర్కారు తోడ్పాటుతో ఏపీ రెట్టింపు వేగంతో మరింత అభివృద్ధి వైపు పయనిస్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా గార మండలంలో శనివా రం ఎమ్మెల్యే గొండు శంకర్ తో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా పలు ప్రారంభోత్సవాలు, శంకు స్థాపన కార్యక్రమాల్లో రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు.తొలుత వమరవల్లి డైట్ పాఠశాలలో అదనపు భవనాలకు 2.4 కోట్లు మంజూరు చేసి నిర్మాణాలు పూర్తయిన అదనపు తరగతి గదులను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్థానిక శాసన సభ్యులు గొండు శంకర్ తో కలసి ఆయన ప్రారంభించారు. నూతన భవనాల్లో ఏర్పాటు చేసిన వసతులను అడిగి తెలుసుకున్నారు. ఎక్కువ మంది విద్యార్థులకు సేవలు అందే విధంగా పలు సూచనలు చేశారు. అదనపు తరగతి గదుల్లో బోధనా గదులు 2, స్మార్ట్ క్లాస్ గదులు 2, కంప్యూటర్ ల్యాబ్ కమ్ ఐటి ల్యాబ్, సైన్స్ ల్యాబ్, మ్యాథ్స్ ల్యాబ్ లాంగ్వేజ్ ల్యాబ్, సోషల్ సైన్సెస్ ల్యాబ్, వర్క్ ఎక్స్‌పీరియన్స్ కు ల్యాబ్, ఫిజికల్ లిటరసీ ల్యాబ్, గర్ల్స్ వాల్టింగ్ హాల్ లతో కలిపి ఈ భవనాలను 2.40 కోట్ల రూపాయలతో నిర్మించారు.భవనంలోని గదులు పరిశీలించిన కేంద్ర మంత్రి.. అందించిన వసతులు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఇదే ప్రాంగణంలో ఆడిటోరియం, రెండు దార్మిటరీలు గ్రౌండ్ ఫ్లోర్ లో అన్ని వసతులతో కూడిన 4 గదులు, మొదటి అంతస్తులో 4 గదుల డిజైన్ తో 6.06 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న భవన సముదా యానికి కేంద్ర మంత్రి శంకుస్థాపన చేశారు.అనంతరం ఎన్.ఆర్.ఈ.జీ.ఎస్ నిధులు 40 లక్షలతో గార మండల కేంద్రంలో నిర్మించిన సచివాలయ భవనాన్ని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రారంభించారు.పార్క్ పరిసరాలను కలియతిరిగి నిర్మాణం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి పర్యటన నేపథ్యంలో నియోజవర్గ కూటమి శ్రేణులు ఎక్కడికక్కడ ఘన స్వాగతాలు పలికారు. ఈ సంధర్భంగా పలు చోట్ల ఆలయాలను కేంద్ర మంత్రి సందర్శించారు. ఈ పర్యటనలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జగన్‌పై ఎమ్మెల్యే ఫైర్ రూ. వెయ్యి పెంచేందుకు ఆయనకు ఐదేళ్లు పట్టింది



**అనంతపురం:** పింఛన్ సొమ్ము రూ.వెయ్యి పెంచేందుకు జగన్‌కు ఐదేళ్ల పట్టిందని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ విమర్శి ంచారు. రాజీవ్ కాలనీ పంచాయతీలోని మరాఠీకాలనీ, 16వ డివిజన్‌లోని బాబానగర్, 38వ డివిజన్‌లోని కోవూరు నగర్‌లో ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ... జగన్ ప్రభుత్వంలో రాష్ట్రానికి ఎలాంటి పెట్టుబడులు రాలేదని, ఆఖరికి విశాఖపట్నంలో ప్రభుత్వ ఆఫీసులను తాకట్టు పెట్టారని, ఆయన మరోసారి సీఎం అయి ఉంటే రాష్ట్రాన్ని పూర్తిగా తాకట్టు పెట్టేవారని ఈ సందర్భంగా దుయ్యబట్టారు.ఏడాదిలో నగర రూపురేఖలు మార్చేస్తాంఅనంతపురం క్లాక్‌టవర్: ఏడాదిలో నగర రూపురేఖలు మార్చేస్తామని, అందుకు ప్రణాళికను అమలు చేయబోతున్నామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. 38వ డివిజన్‌లోని విద్యారణ్య పాఠశాల వద్ద రూ.39 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని భూమిపూజ చేశారు. అలాగే 27వ డివిజన్‌లో రూ.70లక్షలతో పూర్తి చేసిన అశోక్‌నగర్ మెయిన్ రోడ్డును శిలా ఫలకం ఆవిష్కరించి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదన్నారు.కూటమి వచ్చాక నగరంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెట్టిస్తున్నామని తెలిపారు. గుంతల రోడ్లను బాగు చే స్తూ.. మురుగు కాలవల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. ఏడాదిలోపు నగర రూపురేఖలు మార్చే ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో నగరపాలక సంస్థ కమిషనర్ బా లస్వామి, ఎస్ఈ రాజశేఖర్, ఈఈ షాకీర్, ఎంపీడీఓ దివాకర్, మాంసాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రకాషనాయుడు, వీర శైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ స్వప్న,టీడీపీ జిల్లా అధికారప్రతినిధి సరిపూటి రమణ, మాజీ కార్పొరేటర్ బల్లాపల్లవి, టీడీపీ రాష్ట్ర కార్యని ర్వాహక కార్యదర్శులు గాజుల ఆదెన్న, భావన, రాష్ట్ర కార్యదర్శులు ఆదినారాయణ, రాయల్ మురళి, సుధాకర్‌నాయుడు, నెట్టెం బాలకృష్ణ, బీజేపీ నాయకుడు లలిత్‌కుమార్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనర సింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాద వ్, ఉపాధ్యక్షుడు రమేష్, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు భవానీ రవికుమార్, పీఎల్ఎన్ మూర్తి, పోతుల లక్ష్మీనరసింహులు, కడియాల కొండన్న, పరమేశ్వర్, శివ, పవన్‌తోపాటు నాయకులు పాల్గొన్నారు.విధుల్లోకి తీసుకోవాలని వినతనగర పాలక సంస్థలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న కార్మి కులను వయోపరిమితి సాకుతో తొలగించడం దారుణమని, తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఎస్సీ మున్సిపల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు అజయ్‌బాబు డిమాండ్ చేశారు. ఆర్అ ండ్‌బీ అతిథిగృహంలో ఎమ్మెల్యేని కలిసి వినతిపత్రం అంద జేశారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు తిరుపాలు, ఉపాధ్యక్షులు సురేషబాబు, వెంకటప్ప, చిరంజీవి, ఓబుళేసు, రాఘవ, గంగాధర్, అంజి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మాఫియా లేడీ డాన్ కామాక్షమ్మ ఇంటిని కూల్చివేసిన స్థానికులు



**అమరావతి, డిసెంబర్ 02:** నెల్లూరులో సీపీఎం నేత హత్య కేసులో ప్రధాన నిందితురాలు, గంజాయి మాఫియా లేడి డాన్ కామాక్షమ్మకు చెందిన ఐదు ఇళ్లను మంగళవారం స్థానికులు నేలమట్టం చేశారు. నేరస్తులను పెంచి పోషించడంతోపాటు గంజాయి మాఫియా నడుపుతూ.. కామాక్షమ్మ తమను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేసిందని ఈ సందర్భంగా స్థానికులు మండిపడ్డారు. తమ పిల్లలకు గంజాయి అలవాటు చేసి.. వారి జీవితాలతో చెలగాటం ఆడిందని వారు వాపోయారు. ఇదేమిటని ప్రశ్నించిన వారిపై ఆమె అనుచరులు తీవ్రంగా దాడి చేయడమే కాకుండా హత్యాయత్నాలకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచలయ్య హత్య కేసులో కామాక్షమ్మతోపాటు ఇతర నిందితులను కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.స్థానిక ఆర్డీటీ కాలనీలో కూల్చివేసిన ఇళ్లలో కామాక్షమ తన తల్లి సోదరులతో నివాసం ఉంటుంది. ఈ కాలనీలోని నివాసాలను కేంద్రంగా చేసుకుని ఆమె పలు అరా చకాలకు పాల్పడిందని స్థానికులు వివరించారు. సీపీఎం నేత పెంచలయ్య హత్య కేసులో ప్రధాన నిందితులంతా కామాక్షమ్మ తోపాటు ఆమె అనుచరులేనని స్థానికులు వివరిస్తు న్నారు. కొన్ని ఏళ్లుగా కామాక్షమ్మతోపాటు ఆమె అనుచరులు ఇక్కడే ఉంటూ.. ప్రజలను భయబ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా వీరంతా.. యువతకు గంజాయి అలవాటు చేసి తమ నేర సామ్రాజ్యాన్ని విస్తరించారని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో కామాక్షమ్మ, ఆమె మరిదితోపాటు పలువురు అనుచరులపై వివిధ నేరాల కింద పోలీసులు కేసులు నమోదు చేశారని స్థానికులు వివరించారు. ఎన్నో ఏళ్లుగా ఆమె చేస్తున్న అరాచకాలు భరిస్తున్నామని పేర్కొన్నారు. ఇటీవల ఆమెను పోలీసులు అరెస్ట్ చేశారు. దాంతో స్థానికులు, సీపీఎం నేతల ఆగ్రహం ఒక్కసారిగా కట్టలు తెంచుకుంది. దాంతో కామాక్షమ్మ తోపాటు ఆమె బంధువులు, అనుచరుల కూలగొట్టారు.

# మామధ్య వివాదాలు లేవు, కలిసి పనిచేస్తున్నాం సిద్ధరామయ్య క్లారిటీ



**బెంగళూరు:** కర్ణాటక ముఖ్యమంత్రి ఎస్.సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మంగళవారంనాడు కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేశారు. డీకే శివకుమార్ ఆహ్వానం మేరకు ఆయన నివాసానికి సీఎం వెళ్లారు. నాయకత్వ మార్పుపై అందరిలోనూ గందరగోళం నెలకొన్న నేపథ్యంలో సిద్ధరామయ్య ఇటీవల తన నివాసంలో డీకేకు బ్రేక్‌ఫాస్ట్ ఇచ్చారు. రెండో రౌడ్ బ్రేక్‌ఫాస్ట్ చర్చలు ఈసారి డీకే నివాసంలో జరిగాయి. అనంతరం ఇరువురు నేతలూ ఐక్యతా సందేశాన్ని చాటుతూ మీడియా ముందుకు వచ్చారు. సమావేశం వివరాలను వెల్లడించారు. ప్రభుత్వంలోని నేతలంతా ఐక్యంగా ఉన్నామని, 2028 అసెంబ్లీ ఎన్నికలను కలిసికట్టుగా ఎదుర్కొంటామని సిద్ధరామయ్య తెలిపారు. శివకుమార్‌తో విభేదాలు ఉన్నాయనే ఆరోపణలపై స్పందిస్తూ, తమ మధ్య ఎలాంటి వివాదాలు లేవని, తాము కలిసికట్టుగానే ప్రభుత్వాన్ని నడుపుతామని చెప్పారు. అసెంబ్లీలో బీజేపీ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే దానిని బలంగా ఎదుర్కొంటామని మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.కాగా, ముఖ్యమంత్రికి తన నివాసంలో బ్రేక్‌ఫాస్ట్ ఇచ్చానని, రాష్ట్రానికి సుపరిపాలన అందించడడానికి తాము కట్టుబడి ఉన్నామని, రాష్ట్రాభివృద్ధి విజన్‌ను కాంగ్రెస్ కొనసాగిస్తుందని డీకే శివకుమర్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు. రొటోనషనల్ పద్ధతిలో డీకే శివకుమార్‌కు ముఖ్యమంత్రి పగ్గాలు అప్పగించాలని ఆయన వర్గీయులు డిమాండ్ చేస్తున్నారు. అధిష్ఠా నంపై ఒత్తిడి తెచ్చేందుకు పలువురు ఎమ్మెల్యేలు ఇటీవల ఢిల్లీకి కూడా వెళ్లారు. అయితే తాను ఎమ్మెల్యేలను ఎవరినీ ఢిల్లీకి పంపలేదని, మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశాలున్నందున మంత్రి పదవుల కోసం వెళ్లి ఉండవచ్చని డీకే ఇటీవల తెలిపారు. నాయకత్వ మార్పుపై అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా తాము కట్టుబడి ఉంటామని సిద్ధరామయ్య, డీకే ప్రకటించారు. ఈ నేపథ్యంలో ముందుగా ఇరువురు నేతలు కలిసి చర్చించుకోవాలని, ఐక్యతా సందేశాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని కాంగ్రెస్ అధిష్ఠానం వారికి సూచించింది.

# రెండు దశల్లో 'జన గణన'- డిజిటల్ విధానంలో నిర్వహిస్తాం: కేంద్రం



**న్యూ ఢిల్లీ :** దేశంలో జనగణన రెండు దశల్లో నిర్వహించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. 2026 ఏప్రిల్ - సెప్టెంబర్ మధ్య మొదటి దశ, 2027 ఫిబ్రవరిలో రెండో దశ జన గణన జరుగుతుందని మంగళవారం లోక్‌సభకు తెలిపింది.కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ వేసిన ప్రశ్నకు, హోమ్ వ్యవహారాల సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ సమాధానం ఇస్తూ, జన గణన గురించి తెలిపారు. జన గణన మొదటి దశలో హౌస్ లిస్టింగ్, సెన్సెన్స్, రెండో దశలో జనాభా లెక్కల సేకరణ జరుగుతుందని స్పష్టం చేశారు. 'మొదటి దశ జన గణన 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు జరుగుతుంది. అయితే ఆయా రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల సౌలభ్యానికి అనుగుణంగా 30 రోజుల వ్యవధిలోనే సెన్సెస్? నిర్వహణ ఉంటుందని' నిత్యానంద్ రాయ్ పేర్కొన్నారు."జన గణన 2027 ఫిబ్రవరి నుంచి మార్చి 1 మధ్యలో జరుగుతుంది. అయితే లద్దాఖ్, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోని మంచుతో కప్పపడే నాన్-సింక్రోనస్ ప్రాంతాల్లో జన గణన 2026 సెప్టెంబర్ నుంచి అక్టోబర్? 1 మధ్య జరుగుతుంది" అని నిత్యానంద్ రాయ్ లోక్‌సభకు తెలిపారు.ఈ ప్రక్రియకు ముందు వివిధ మంత్రిత్వశాఖలు, విభాగాలు, సంస్థలు, సెన్సెస్ డేటా యూజర్ల నుంచి వచ్చిన సలహాలు, సూచనలు ఆధారంగా జన గణన ప్రశ్నాపత్రాన్ని రూపొందించినట్లు మంత్రి నిత్యానంద్ రాయ్? చెప్పారు. మన దేశంలో జన గణనకు 150 ఏళ్లకు పైగా చరిత్ర ఉందని, ఇంతకు ముందు నిర్వహించిన జనాభా లెక్కల నుంచి నేర్చుకున్న పాఠాలను తదుపరి జన గణన కోసం పరిగణనలోకి తీసుకుంటామని ఆయన అన్నారు.కుల గణన కూడామరో ప్రశ్నకు సమాధానం ఇస్తూ, ఈ ఏడాది ఏప్రిల్? 30న రాజకీయ వ్యవహారాల క్యాబినే కమిటీ నిర్ణయించిన విధంగా, కుల గణన కూడా ఈ జనాభా గణనలోనే జరుగుతుందని నిత్యానంద్ రాయ్ లోకసభకు తెలిపారు.డిజిటల్ విధానంలో జనగణనమరో ప్రశ్నకు జవాబిస్తూ, 2027 జనాభా లెక్కింపు డిజిటల్ వేలో నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మొబైల్ యాప్?ల ద్వారా డేటాను సేకరిస్తామని, స్వీయ గణనకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన అన్నారు.ఈ డిజిటల్ విధానంతో జనాభా లెక్కించేందుకు అధికారులతోపాటు ప్రజలకూ అవకాశం ఇవ్వనున్నారు. ఇంతకు మునుపే రిజిస్ట్రార్ జనరల్, జనాభా గణన కమిషనర్ కార్యాలయం పౌరులను అడగడానికి దాదాపు 30కిపైగా ప్రశ్నలను సిద్ధం చేసింది. ఈ సర్వేలో ఫోన్లు, ఇంటర్నెట్, వాహనాలు (సైకిల్, స్కూటర్, బైక్, కారు, జీప్, వ్యాన్), గృహోపకరణాలు (రేడియో, టీవీ, ట్రాన్సిస్టర్) వంటి వస్తువుల యాజమాన్యం గురించి ప్రజలను అడుగుతారు. తృణధాన్యాల వినియోగం, తాగునీటి వనరులు, లైటింగ్, మరుగుదొడ్ల వాడకం, స్నానం, వంటగది సౌకర్యాలు, వంట కోసం ఉపయోగించే ఇంధనం, ఎల్పీజీ/పీఎన్జీ కనెక్షన్ గురించి కూడా అడుగుతారు. ఇంటి ఫ్లోరింగ్, గోడలు, పైకప్పు కోసం ఉపయోగించిన మెటీరియల్, నివాసితుల సంఖ్య, ఇంటి గదుల సంఖ్య, ఇంటి యజమాని గురించి ప్రశ్నలు ఉంటాయి.పదేళ్లకొకసారి జనగణనమన దేశంలో సాధారణంగా పదేళ్లకోసారి జనాభా లెక్కలు నిర్వహిస్తారు. ఆఖరిగా 2011లో జనాభా లెక్కలు సేకరించారు. ఆ తర్వాత కొవిడ్ కారణంగా 2021లో నిర్వహించాల్సిన జనగణన నిలిచిపోయింది. త్వరలో చేపట్టనున్నది 16వ జనాభా గణన. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత లెక్కవేసుకుంటే ఇది 8వది అవుతుంది.

# పార్లమెంట్‌లో ఎస్ఐఆర్ పై చర్చిద్దాం విపక్షాలకు ఆహ్వానం



**న్యూ ఢిల్లీ :**ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ' (ఎస్ఐఆర్)పై చర్చ కోసం పార్లమెంట్ కార్యకలాపాలు పదేపదే వాయిదా పడుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పార్లమెంట్‌లో నెలకొన్న ప్రతిష్టంభనను తొలగించేందుకు విపక్ష పార్టీల నేతలను చర్చలకు ఆహ్వానించింది. ఈ విషయాన్ని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మంగళవారం వెల్లడించారు.శీతాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి విపక్షాలు 'ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ' (ఎస్ఐఆర్)పై చర్చ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాయి. దీనితో పదేపదే పార్లమెంట్ ఉభయ సభలు వాయిదా పడుతూ వస్తున్నాయి. దీనితో ఈ ప్రతిష్టంభనను ముగించడానికి వివిధ పార్టీల నేతలను చర్చలకు ఆహ్వానించామని, అయితే ఈ చర్చలకు ఎటువంటి గడువును నిర్ణయించలేదని కిరణ్ రిజిజు లోక్‌సభలో చెప్పారు. 9 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో చేపట్టిన ఎస్ఐఆర్‌పై చర్చ చేయాలని విపక్షాలు నినాదాలు చేస్తున్న సమయంలో, కిరణ్ రిజిజు మాట్లాడుతూ, "ప్రభుత్వం ఏ అంశంపై అయినా చర్చించడానికి సిద్ధంగా ఉంది. ఇందుకోసం వివిధ పార్టీల నాయకులను చర్చలకు ఆహ్వానించాం. కానీ కేవలం ఎస్?ఐఆర్ అనే ఒక అంశంపై చర్చించడానికి పార్లమెంట్ కార్యకలాపాలకు అంతరాయం కలిగించలేం. చిన్న చిన్న పార్టీలు కూడా తమకు అత్యంత ముఖ్యమైన అంశాలపై చర్చించాలని అనుకుంటుు న్నాయి. వాటికంటే ఎస్ఐఆర్‌పై చర్చ ఎక్కువేమీ కాదు" అని రిజిజు పేర్కొన్నారు.బిహార్ ఎన్నికల్లో ఘోరపరాజ యం పాలైన కాంగ్రెస్‌ను కిరణ్ రిజిజు విమర్శిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. "2 నుంచి 4 పార్టీలు పార్లమెంట్ కార్యకలా పాలకు అంతరాయం కలిగిస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో గెలుపు, ఓటములు సహజం. కానీ ఓటమి వల్ల కలిగిన కోపాన్ని వెళ్లగక్కకూడదు. కానీ ఓడిన (కాంగ్రెస్) పార్టీ నేతలు ఇలా సభకు అంతరాయం కలిగిస్తూ, ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్నారు. దివంగత బీజేపీ నేత అటల్ బిహారీ వాజ్‌పేయీ కూడా ఎన్నికల్లో ఓడిపోయారు" అని రిజిజు అన్నారు.మరోవైపు, లోక్‌సభలో నిరసన తెలుపుతున్న సభ్యులను ఉద్దేశించి రిజిజు మాట్లాడుతూ, సభా మర్యాదను కాపాడాలని, చిన్న పార్టీల నేతలు చెప్పే సమస్యల గురించి కూడా వినాలని అన్నారు. "దయచేసి దేనికీ ఒక టైమ్‌లైన్ పెట్టకండి. నేను వివిధ రాజకీయ పార్టీల నేతలతో చర్చలు జరపబోతున్నాను. అవి అధికారికంగాగానీ, అనధికారి కంగా కానీ కావచ్చు. ప్రతీదీ యాంత్రికంగా ఉండకూడదు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో మనం చర్చల్లో పాల్గొనాలి" అని రిజిజు అన్నారు.పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభ మైనప్పటి నుంచి ప్రతిపక్ష ఎంపీలు ఎస్ఐఆర్‌పై చర్చించాలని ఉభయసభల్లో నిరసనలు చేపట్టాయి. దీనితో రెండు సభలు పదే పదే వాయిదా పడుతూ వస్తున్నాయి. మంగళవారం ఇప్పటి వరకు లోక్?సభ రెండు సార్లు, రాజ్యసభ ఒక్కసారి వాయిదా పడింది.వాస్తవానికి పార్లమెంటు శీతాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. 15 రోజుల పాటు సాగనున్న ఈ సమావేశాలు డిసెంబర్ 19న ముగియనున్నాయి. దేశ చరిత్రలోనే ఈ అతితక్కువ సమయం కొనసాగిన శీతాకాల సమావేశాలుగా ఇవి నిలవనున్నాయి. మోదీ సర్కార్ ఈ సమావేశాల్లోనే 13 బిల్లులను ఆమోదించాలని భావిస్తోంది. వీటిలో ఒకటి ఆర్డినెన్స్ స్థానంలో ఉండగా, రెండింటిని లోక్‌సభ కమిటీ ఆమోదించింది. మరోవైపు ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై పార్లమెంటులో చర్చించాలని మెజార్టీ విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. దిల్లీ పేలుడు ఘటన నేపథ్యంలో దేశ భద్రత, విదేశాంగ విధానం, రైతుల సమస్యలు, దిల్లీలో వాయు కాలుష్యంపైనా చర్చించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఎస్ఐఆర్‌పై చర్చ చేపట్టాల్సిందేనని తృణమూల్ కాంగ్రెస్ కూడా డిమాండ్ చేసింది.

# రాజ్‌భవన్ కాదు ఇక నుంచి లోక్ భవన్




**న్యూ ఢిల్లీ :**కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పలు కీలక నిర్ణయాలు తీసుకుంటోంది.. ముఖ్యంగా.. పాలన భావన కేవలం పరిపాలనాపరమైనది కాదు. ఇది సాంస్కృతిక వైభవాన్ని తెలపడంతోపాటు.. నైతికమైనది అని గుర్తుచేసేలా.. వలసవాద పేర్లు, చిహ్నాలను రద్దు చేస్తోంది.. అంతేకాకుండా.. భారత ప్రజాస్వామ్యం అధికారం కంటే బాధ్యతను, హోదా కంటే సేవను ఎంచుకుంటోంది.. అనేలా.. పలు కీలక నిర్ణయాలు తీసుకుంటోంది.. అందులో భాగంగా.. గవర్నర్‌ల అధికారిక నివాసాలైన రాజ్ భవన్ పేర్లను ఇకపై లోక్ భవన్‌గా పిలవనున్నారు.. 'ప్రజా సేవ' అనే ప్రభుత్వ నినాదానికి అనుగుణంగా ఈ మార్పు చేయాలని కేంద్రం నిర్ణయించుకుంది.. దీనికి అనుగుణంగా.. కేంద్ర హోం శాఖ కీలక ప్రకటన చేసింది.. దేశవ్యాప్తంగా గవర్నర్ల అధికారిక నివాసం, కార్యాలయ భవనంగా ఉన్న 'రాజ్ భవన్' పేరును 'లోక్ భవన్'గా మార్పు చేస్తున్నట్లు ఈ నెల 25వ తేదీన జారీ చేసిన అధికారిక ఉత్తర్వుల్లో పేర్కొంది.. దేశంలో ఎక్కడా 'రాజ్ భవన్' అనే పదం అధికారికంగా ఉపయోగించరాదని కేంద్రప్రభుత్వం స్పష్టం చేసింది. రాజ్యాంగంలో గవర్నర్ పదవి రాజన్యతకు ప్రతీక కాదని, ప్రజల ప్రతినిధిగా పనిచేసే వ్యవస్థ అనే ఉద్దేశంతో 'లోక్ భవన్' అంటే.. ప్రజల భవనం గా కొత్త పేరును ఎంచుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయ. ఈ మార్పు ద్వారా రాజ్యాంగ గణతంత్ర విలువలను మరింత బలపరుస్తున్నట్లు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కీలక నిర్ణయాలు నిశ్శబ్దంగా.. లోతైన మార్పునకు గురవుతున్నాయి. పాలన భావన కేవలం పరిపాలనాపరమైనది కాదు. ఇది సాంస్కృతిక .. నైతికమైనది.. అంటూ మోదీ ప్రభుత్వం గుర్తుచేస్తోంది.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో, పాలనా స్థలాలు కర్తవ్యం పారదర్శకతను ప్రతిబింబించేలా పునర్నిర్మిం చబడ్డాయి. ప్రతి పేరు, ప్రతి భవనం, ప్రతి చిహ్నం ఇప్పుడు ఒక సాధారణ ఆలోచనను సూచిస్తుంది.. ప్రభుత్వం ప్రజలకు సేవ చేయడానికి ఉంది.. అనేలా ప్రతి నిర్ణయం ప్రతిబింబిం స్తోంది. అంతకు ముందు రాజ్ పథ్ .. కర్తవ్య మార్గంగా మారింది. ఒక మైలురాయి వీధి కాదు. ఇది ఒక విధి. వలసవాద పేర్లు, చిహ్నాలను రద్దు చేస్తామని ప్రధాని మోదీ చెప్పిన విధంగా.. ఇండియా గేట్ వద్ద ఉన్న నేతాజీ విగ్రహం నుంచి రాష్ట్రపతి భవన్ వరకు ఉన్న మార్గాన్ని కర్తవ్యపథ్‌గా నామకరణం చమోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధానమంత్రి అధికారిక నివాసాన్ని 2016లో మార్చారు.. ఇది ప్రత్యేకతను కాదు, సంక్షేమాన్ని తెలియజేసే పేరు. ఎన్నికైన ప్రతి ప్రభుత్వానికి ముందున్న పనికి గుర్తుగా అభిప్రాయపడ్డారు.ప్రధాని కార్యాలయాన్ని సేవా తీర్థ్ అని నామకరణం చేశారు. సేవా స్ఫూర్తిని ప్రతిబింబించేలా %-% జాతీయ ప్రాధాన్యతలు రూపుదిద్దుకునేలా కార్యాలయాన్ని రూపొందించారు.కేంద్ర సచివాలయానికి కర్తవ్య భవన్ అని పేరు పెట్టారు. ప్రజా సేవ అనేది ఒక నిబద్ధత అనే ఆలోచన చుట్టూ నిర్మించబడిన విశాలమైన పరిపాలనా కేంద్రం..

# పార్లమెంట్లో 'సంచార్ సాథీ' రగడ దేశ ప్రజల ప్రైవసీపై దాడి అంటూ విపక్షాల నిరసన




**ఢిల్లీ, నవంబర్ 2:** 'సంచార్ సాథీ' అంశం హస్తినతోపాటు, దేశవ్యాప్తంగా హాట్ టాపిక్ అయింది. దేశంలో విక్రయించే అన్ని కొత్త స్మార్ట్‌ఫోన్‌లలో సంచార్ సాథీ యాప్‌ను ప్రీ-ఇన్‌స్టాల్ (డిఫాల్ట్‌గా) చేయాలంటూ కేంద్రం ఇచ్చిన ఆదేశాలపై విపక్షాలు మండిపడుతున్నాయి.పార్లమెంట్‌లో ఈ అంశంపై తీవ్ర స్థాయిలో చర్చ జరిగింది. ప్రధానంగా కాంగ్రెస్, శివసేన, దీన్ని తీవ్రంగా విమర్శిస్తూ, ఇది.. ప్రైవసీ ఉల్లంఘనే అంటూ సభా కార్యక్రమాలకు అడ్డుతగిలాయి. దీంతో సభలో తీవ్ర గందరగోళం ఏర్పడింది. విపక్ష కాంగ్రెస్ దీనిమీద వాయిదా తీర్మానం దాఖలు చేసి, సంచార్ సాథీపై విస్తృత చర్చ కావాలని డిమాండ్ చేశాయి.సంచార్ సాథీ యాప్ ఫోన్ యూజర్ల కదలికల్ని, మెసేజెస్, కాల్స్ మానిటర్ చేస్తుందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ %ఖజ% వేణుగోపాల్ దీనిని ఇదొక డిస్టోపియన్ టూల్ అని.. ఇది ప్రతి భారతీయుడిని మానిటర్ చేయడమేకాకుండా. వారి ఆర్థిక హక్కులపై దాడిగా అభివర్ణించారు. దీని అమలు రాజ్యాంగ విరుద్ధమని విమర్శించారు.లోక్‌సభలో కాంగ్రెస్ రేణుక చౌదరి దీనిపై వాయిదా తీర్మానం దాఖలు చేశారు. శివ సేన ప్రియాంక చతుర్వేది దీనిపై మాట్లాడుతూ ఇది ఒక దారుణమైన పరిణామమని.. ఇది భవిష్యత్‌లో నియంతృత్వానికి దారితీస్తుందన్నారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాగరిక ఘోస్ కూడా దీనిని తీవ్రంగా తప్పుబట్టారు. ఇది ప్రభుత్వంపై నమ్మకాన్ని సన్నగిల్లేలా చేస్తుందని విమర్శించారు.విపక్షాల ఆందోళన నేపథ్యంలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు సంచార్ సాథీ యాప్ పై వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. సంచార్ సాథీ మీద చర్చకు ప్రభుత్వం వ్యతిరేకం కాదని, కానీ ఎజెండా ప్రకారం. సెషన్‌లో 14 బిల్లులపై ఫోకస్ పెడదామని సూచించారు. అటు, డిపార్ట్ మెంట్ ఆఫ్ టెలికాం (%ఙశీ%) కూడా దీనిపై స్పందించింది. సంచార్ సాథీ కేవలం ప్రజల సైబర్ సెక్యూరిటీ కోసం ఉద్దేశించింది మాత్రమేనని, ఇందులో ప్రైవసీ ఉల్లంఘన లేదంది. ఈ యాప్ యూజర్ డేటా రక్షిస్తుందని తెలియజేసింది.

# కాల్పుల విరమణ విజ్ఞప్తి పాకిస్థాన్ నుంచే వచ్చింది




**న్యూ ఢిల్లీ :**ఆపరేషన్ సిందూర్ సమయంలో నౌకాదళం దాడుల ముప్పును గ్రహించే పాకిస్థాన్, కాల్పుల విరమణకు విజ్ఞప్తి చేసినట్లు నౌకాదళం వైస్ అడ్మిరల్ కె.స్వామినాథన్ తెలిపారు. నౌకాదళం వార్షికోత్సవానికి ముందు మీడియాతో మాట్లాడిన వైస్ అడ్మిరల్ స్వామినాథన్ ఆపరేషన్ సిందూర్ సందర్భంగా అతితక్కువ సమయంలో 30కిపైగా నౌకలను, జలాంతర్గాములను సమీకరించినట్లు చెప్పారు. విక్రాంత్ క్యారియర్ బ్యాటిల్ గ్రూప్‌లో భాగంగా మక్రాన్ తీరంలో నౌకలను ముందు వరుసలో నిలిపినట్లు వెల్లడించారు.'ఏప్రిల్‌లో వరుసగా ఆయుధ పేలుళ్లు విజయవంతంగా నిర్వహించటం సహా భారత నౌకాదళం మోహరింపు వల్ల పాకిస్థాన్ నౌకాదళం తన తీరప్రాంతానికే పరిమితమైంది. భారత నౌకాదళం దాడుల ముప్పును గ్రహించి పాకిస్థాన్ కాల్పుల విరమణకు విజ్ఞప్తి చేయటానికి ఒక కారణం.' అని స్వామినాథన్ చెప్పారు.

# తీరు మార్చుకోని పాక్ భారత గగనతలంలోకి విమానాలను అనుమతించినా



**న్యూ ఢిల్లీ :** దిత్వా తుపానుతో ఇబ్బందుల్లో పడిపోయిన శ్రీలంకను ఆదుకునేందుకు భారత్ రంగంలోకి దిగింది. ఆపరేషన్ సాగర్ బంధు పేరిట మానవతాసాయాన్ని అందిస్తోంది. ఇక శ్రీలంకకు తామూ సాయం చేస్తామన్న పాక్‌కు కూడా భారత్ సహకరించింది. పాక్ విమానాలు భారత గగనతలం మీదుగా శ్రీలంక చేరేందుకు అడిగిన వెంటనే అనుమతించిందిఅయితే, భారత్‌పై దుష్ప్రచారమే పనిగా పెట్టుకున్న పాక్ మరోసారి తన కుయుక్తులను ప్రయోగించింది. పాక్ మీడియా భారత్‌పై ఫేక్ వార్తలను వండివార్చింది. మానవతా సాయానికి ఉద్దేశించిన విమానాలను కూడా భారత్ తన గగనతలంలోకి అనుమతించలేదంటూ వార్తలను ప్రచురించింది.పాక్ దుష్ప్రచారాన్ని భారత్ వర్గాలు వెంటనే ఖండించాయి. పాక్ అడిగిన వెంటనే కావాల్సిన అనుమతులు ఇచ్చామని తెలిపాయి. ప్రామాణిక పద్ధతులు, సాంకేతిక అంశాలు, భద్రతా పరమైన సమస్యలను పరిగణలోకి తీసుకుని అనుమతులు ఇచ్చామని తెలిపాయి.భారత వర్గాల ప్రకారం, సోమవారం మధ్యాహ్నం 1 గంటకు పాక్ అధికారికంగా అనుమతిని కోరింది. సంక్షోభంలో ఉన్న శ్రీలంక ప్రజలను దృష్టిలో పెట్టుకుని భారత్ అత్యంత వేగంగా స్పందించింది. కేవలం నాలుగు గంటల వ్యవధిలోనే కావాల్సిన అనుమతులను జారీ చేసింది. పాక్ మీడియా వార్తలన్నీ అసత్యాలేనని భారత వర్గాలు తేల్చి చెప్పాయి.ఇక శ్రీలంకను ఆదుకునేందుకు భారత్ 53 టన్నుల వివిధ రకాల సహాయక సామగ్రిని పంపించింది. శ్రీలంక ఎయిర్ ఫోర్స్‌తో కలిసి భారత నేవీ పలు సహాయక చర్యల్లో పాల్గొంటోంది. జాతీయ విపత్తు నిర్వహణ బృందం, వైద్య బృందాన్ని కూడా శ్రీలంకకు పంపించింది. ఈ నేపథ్యంలో శ్రీలంక భారత్‌కు ధన్యవాదాలు కూడా తెలిపింది. మరో దిత్వా బారిన పడి ఇప్పటివరకూ 360 మంది కన్నుమూశారు. మరో 370 మంది గల్లంతయ్యారు. నిర్వాసితులుగా మారిన సుమారు 2 లక్షల మందిని ప్రభుత్వం తాత్కాలిక వసతి కేంద్రాలకు తరలి ంచింది. కండి, బదుల్లా, నువారా ఎలియా, మటాలే జిల్లాలో తుఫాను బీభత్సం అధికంగా ఉంది.

# విపక్ష పార్టీల ఫ్లోర్ లీడర్లతో స్పీకర్ ఓంబిర్లా సమావేశం



**న్యూ ఢిల్లీ :**పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో తొలి రెండు రోజులు ఎలాంటి చర్చ లేకుండా ముగిశాయి. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను వ్యతిరేకిస్తూ ఉభయసభల సభ్యులు ఆందోళనకు దిగడంతో గందరగోళం నెలకొంది. మంగళ వారం కూడా ముందుగా వందేమాతరం పై చర్చకు ప్రభుత్వం పూనుకోగా.. పై చర్చకు ప్రతిపక్షాలు పట్టుబట్టాయి.తీవ్ర గందరగోళం కారణంగా లోక్‌సభ రేపటికి వాయిదాపడింది. ఇకముందు కూడా ఉభయసభలు సజావుగా సాగే అవకాశం లేకపోవడంతో స్పీకర్ ఓంబిర్లా విపక్ష పార్టీల శాసనసభాపక్ష నేతలతో సమావేశమై పరిస్థితిని చక్కదిద్దాలని నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. పార్లమెంట్ హౌస్‌లోని స్పీకర్ చాంబర్‌లో ఈ సమావేశం జరుగనున్నట్లు సమాచారం.

# పార్లమెంటులో విపక్షం రచ్చ రాజకీయం !

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఊహించినట్లుగానే వాయిదాలతో మొదలయ్యాయి గతానికి భిన్నాంగా సమావేశాలు ప్రారంభం కాలేదు. గతంలోనూ ఇలాగే వాయిదాల మీద వాయిదాలు పడుతూ..మధ్యమధ్యలో ప్రభుత్వం తనకు కావాల్సిన ఎజెండాను పూర్తి కానిచ్చుకుని, నిరవధికంగా వాయిదా వేస్తూ వస్తోంది. ఇదే తంతు గత కొన్నేళ్లుగా చూస్తున్నాం. గొడవ చేయడం, తాము పట్టిన అంశంపైనే చర్చించాలని విపక్షం పట్టుబట్టడం..ప్రభుత్వం ససేమిరా అనడం..వాయిదా పడడం కూడా గత సమావేశాల్లో చూశాం. ఇప్పుడు కూడా అందుకు భిన్నంగా ఏమీ జరగడం లేదు. విపక్షాలు ఇదే పెద్ద విజయంగా భావిస్తున్నాయి. కోరుకున్న అంశంపై ఎలా చర్చించాలో తెలియని వారంతా పార్లమెంటులో ఎంపిలుగా ఉన్నారు. ఏ రూల్ కింద కోరితే చర్చకు వస్తుందో అందరికీ తెలుసు. కానీ రూల్ బ్రేక్ చేసి, పట్టుబట్టి చర్చించాలని కోరుకోవడం దుర్మార్గం. పార్లమెంటులో ప్రజల సమస్యలపై చర్చించడం ద్వారా ప్రతిపక్షం ప్రధాన బాధ్యతను తీసుకోవాలి. కానీ గత దశాబ్దకాలంగా అలాంటి సంప్రదాయం తుంగలో తొక్కారు. గొడవ చేయడం విపక్షం వంతయితే..వాయిదా వేయడం ప్రభుత్వం విధానంగా మారింది. ఈ క్రమంలో సోమవారం ప్రారంభమైప పార్లమెంట్ శీతాకాల సమావేశాలు తొలిరోజే వాయిదాతో మొదలయ్యాయి. పార్లమెంటు కార్యకలాపాలను శాంతియుతంగా ముందుకు తీసుకెళ్లకుండా మొండిగా వ్యవహరించడంలో ఇరుపక్షాలు తమవంతు పాత్రను సమర్థంగా నిర్వహించాయి. ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్ పక్రియపై అత్యవసర చర్చ జరపాలని, ప్రతిపక్షాలు డిమాండ్ చేయడం, దానిని తిరస్కరించడం ద్వారా విలువైన పార్లమెంట్ సమయం తొలిరోజు, మలిరోజు ఢిల్లీ కాలుష్యంలో కలిసి పోయాయి. సర్ ద్వారా నకిలీ, చనిపోయిన వారి ఓట్లను తొలగిస్తే విపక్షాలకు అభ్యంతరం ఎందుకన్నది మొదట చర్చించాలి. దేశంలోకి అక్రమంగా ప్రవేశించిన వారు ఇక్కడ ఓటు ఎలా పొందారన్నది రెండో ప్రశ్న. ఈ రెండింటికీ విపక్షాల వద్ద



సమాధానం లేదు. ఒక రాజ్యాంగా సంస్థ ఎన్నికల సంఘం చేపట్టిన ప్రక్రియను అడ్డుకోవడం రాజ్యాంగాన్ని వ్యతిరేకించడమే అవుతుంది. రాజ్యాంగ బుక్‌ను పట్టుకుని ఊరేగుతున్న రాహుల్, ఆయన అనుచరగణానికి ఇది కూడా తెలియకపోవడం మూర్ఖత్వంగానే చూడాలి. రాజ్యాంగ ప్రసాదించిన హక్కుల గురించి మాట్లాడుతున్న రాహుల్ పరివారం దీనిని ఎందుకు వ్యతిరేకిస్తున్నారో చెప్పాలి. రాజ్యాంగ సంస్థ అయిన ఎన్నికల సంఘాన్ని తక్కువ చేసి మాట్లాడడం, వారు చేసే ప్రక్రియలను అడ్డుకోవడం రాజ్యాంగ రక్షణ అవుతుందా అన్నది రాహుల్ చెప్పాలి. ఓట్ల తొలగింపు ప్రక్రియలో ఎవరి ఓటయినా గల్లంతయితే నిలదీయా లి. ఇప్పటికే సుప్రీం గడప దొక్కిన రాహుల్ ఒక్క ఓటుపైనా అఫిడవిట్ దాఖలు చేసి ఆధారాలు చూపలేక పోయారు. బీహార్‌లో ఓటమి అన్నది రాహుల్ స్వయంకృతం తప్ప మరోటి కాదు. ఇవన్నీ కూడా తెలిసి చేస్తున్నవే తప్ప మరోటి కాదు. ఇందులో ప్రజలపై వారికి ఎలాంటి ప్రేమా లేదు. కేవలం అధికార దాహంతో చేస్తున్నవే. అలా కానట్లయితే పార్టమెంటులో చర్చకు నోటీస్ ఇచ్చి, తగిన సమయంలో చర్చించవచ్చు. కానీ అలా చేయడం లేదంటే..రచ్చ చేయడం వారి లక్ష్యంగా కనిపిస్తోంది. ఇటీవల చనిపోయిన వారి ఆధార్ నంబర్లు దాదాపు 2కోట్లను ఉడాయ్ రద్దు చేసింది. అంటే అది తప్పుచేసినట్లుగా భావించాలా చనిపోయిన వారి ఓట్లు, ఊరుమారిన వారి ఓట్లు, అక్రమంగా దేశంలో ఓటర్లుగా నమోదైన విదేశీయుల ఓట్లను అలాగే ఉంచుమంటారా అన్నది రాహుల చెప్పాలి. నిజానికి అధికారంలోకి రావడమే లక్ష్యంగా రాహుల్ చేస్తున్న యాగీలో భాగమే ఈ ఓటు రచ్చ. ప్రజలు ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలను పక్కన పెట్టి తొలిరోజే పార్లమెంటరీ సాంప్రదాయాలను ప్రతిపక్షాలు తుంగలో తొక్కాయి. ఫలితంగా లోక్‌సభ వరుసగా రెండ్రోజులు పూర్తిగా స్తంభించిపోయింది. రాజ్యసభలో ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. ఇది ఇలాగే కొనసాగుతుంది తప్ప కొత్తగా వీరినుంచి ఆశించడానికి ఏమీ ఉండదు. ఎందుకంటే..ఎస్ఐఆర్‌పై పార్లమెంటు దద్దరిల్లింది. ప్రతిపక్షాల ఆందోళనతో లోక్‌సభలో వాయిదాల పర్వం నడిచింది. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీసాం..అని చెప్పుకోవడానికి తప్ప మరోటి కాదు. అందుకే తొలిరోజే.. ఎస్ఐఆర్‌పై చర్చించాలని పట్టుపడుతూ ప్రతిపక్ష సభ్యులు సభా వేదిక వద్దకు దూసుకెళ్లారు. ఇలా వారు అధికారంలో ఉ న్నప్పుడు బిజెపి కూడా చేసిన తతంగమే. ఇది కూడా తమ పోరాటంగా వారు భావిస్తున్నారు. పార్లమెంటు ను స్తంభింప చేయడం అన్నది ఓ విజయంగా భావిస్తున్నారు. సర్‌పై ఎలాగూ ప్రభుత్వం వెంటనే చర్చకు అనుమతించదు. ఎందుకంటే వాయిదా తీర్మానం అన్నది కొంపలు మునిగే సమయంలో మాత్రమే అనుమతిస్తారు. అందుకే విపక్షాలు ఇచ్చిన తీరర్మానాన్ని స్పీకర్ ఓంబిర్లా తిరస్కరించడంతో వేదిక వద్దనే ప్రతిపక్ష ఎంపీలు ఆందోళనకు దిగారు. మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, ఎస్ఐఆర్ ను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయొద్దంటూ నినదించారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. ప్రతిపక్ష సభ్యుల ఆందోళనలపై స్పీకర్ ఓం బిర్లా స్పందిస్తూ అన్ని అంశాలపై చర్చకు సిద్ధమే నని స్పష్టం చేశారు. ప్రజలు మిమ్మల్ని పార్లమెంట్‌కు పంపింది. నినాదాలు, ఆందోళనలు చేయడానికి కాదని స్పష్టం చేశారు.. ఇలా రెండోరోజూ ఇదే సీన్ రిపీట్ అయ్యింది. గతంలో ఆదానీ విసయంలో కూడా ఇలాగే చేశారు. పార్లమెంట్‌ను స్తంభింప చేయడం విజయమనుకుంటే ప్రజలకు జవాబు చెప్పాలి. పార్లమెంట్ అన్నది ప్రజల సొత్తు. కవలం 20,30 మంది ఎంపిలది కాదని గుర్తించాలి. ప్రతిపక్షాలు ఎస్ఐఆర్ అంశంపై అత్యవసర చర్చకు డిమాండ్ చేశాయి. ప్రతిపక్షాల డిమాండ్‌ను పరిశీలిస్తున్నామని, అత్యవసర చర్చ సాధ్యం కాదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. ఆందోళన చేస్తున్నారంటే రాజకీయం తప్ప మరోటి కాదు. ఇలాంటి విపక్షాల వల్లనే పార్లమెంటులో ఏ సమస్యా చర్చకు రావడం లేదు. ప్రభుత్వం కూడా ఇదే కోరుకుంటోంది.

# కర్నాటకలో బ్రేక్‌ఫాస్ట్ రాజకీయాలు

**డికె ఇంటికి వచ్చి అల్పాహారం చేసిన సిద్దు**

**అధిష్టానం కోరుకుంటే డికె సిఎం అవుతారని కామెంట్**

**బెంగళూరు,డిసెంబర్ 2:** కర్ణాటకలో నాయకత్వ మార్పు ఊహాగానాలు కొనసాగుతున్నాయి. ఈ ఊహాగానాల వేళ బ్రేక్‌ఫాస్ట్ రాజకీయాలు తెరపైకి వచ్చాయి. సీఎం మార్పుపై జరుగుతున్న ప్రచారం వేళ రెండు రోజుల క్రితం సీఎం సిద్ధరామయ్య నివాసానికి డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ వెళ్లిన విషయం తెలిసిందే. తాజాగా ఇప్పుడు డీకే ఇంటికి సీఎం సిద్ధూ బ్రేక్‌ఫాస్ట్‌కు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. తన ఇంటికి వచ్చిన సీఎంకు డీకే ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఇద్దరూ కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేశారు. బ్రేక్‌ఫాస్ట్ మీట్‌లో పలు అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది కర్ణాటకలో సీఎం సీటుపై రగడ కొనసాగుతున్న వేళ.. మరోసారి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేశారు. మంగళవారం ఉదయం ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నివాసానికి సీఎం సిద్ధరామయ్య వెళ్లారు. అనంతరం డీకే శివకుమార్‌కు సీఎం పదవిపై సిద్ధరామయ్య మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. అధిష్ఠానం ఎప్పుడు ఆదేశిస్తే.. అప్పుడే డీకే సీఎం అవుతారన్నారు. ప్రస్తుతం తమ పార్టీ 2028 ఎన్నికలు, స్థానిక ఎన్నికల పైనే ప్రధానంగా దృష్టిసారించినట్లు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలే పార్టీ ప్రధాన లక్ష్యమని ఇరువురు నేతలు పేర్కొన్నారు. అల్పాహారం అనంతరం డీకేతో అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహం, రైతుల సమస్యలు సహా పలు ఇతర విషయాలపైనా చర్చించినట్లు సిద్ధరామయ్య తెలిపారు. ఈ విషయాల్లో చర్చలు జరపడానికి పార్టీ హైకమాండ్ పిలిస్తే తాము ఇద్దరం దిల్లీకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వంలోని నేతలంతా ఐక్యంగా



ఉన్నామని.. రాష్ట్రాభివృద్ధి కోసం కలిసి పని చేస్తున్నామన్నారు. 2028 ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ముందుకు వెళు న్నామన్నారు. డిసెంబర్ 8న కాంగ్రెస్ ఎంపీల సమావేశం నిర్వహించడానికి ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఇటీవల డీకే శివకుమార్ సిద్ధరామయ్య నివాసానికి వెళ్లి.. అల్పాహారం చేసిన విషయం తెలిసిందే. అనంతరం ఇరువురు మీడియాతో మాట్లాడుతూ.. నాయకత్వ మార్పుపై కొద్ది రోజులుగా అందరిలో ఉన్న గందరగోళానికి తెరదించేందుకే ఈ బ్రేక్‌ఫాస్ట్ భేటీ జరిగిందన్నారు. భాజపా-జేడీఎస్ తమపై అసత్య ప్రచారాలు చేస్తోందని దుయ్యబట్టారు. ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను ఉమ్మడిగా ఎదుర్కొంటామన్నారు. తమ మధ్య గతంలో ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని.. ఇకముందు కూడా ఉండబోవని స్పష్టంచేశారు. ఇందులోభాగంగానే నేడు మరోసారి డీకే నివాసంలో భేటీ అయ్యారు.

# ఇమ్రాన్ పరిస్థితిపై ఆందోళన

**రోడ్డుపైకి వచ్చిన పార్టీ కార్యకర్తలు**

**రావల్పిండిలో ఆందోళనలు..నిషేధాజ్ఞలు అమలు**


**లాహోర్,డిసెంబర్ 2:** పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ మృతి చెందినట్లు వస్తోన్న వార్తల నేపథ్యంలో పాక్‌లో ప్రజాందోళన మిన్నంటింది. ఇమ్రాన్ ఖాన్‌ను ఎందుకు దాస్తున్నారంటూ ప్రజలు రోడ్డెక్కింది ఆందోళనకు దిగారు. దీంతో రావల్పిండిలో తీవ్ర ఉద్రిక్త పరిస్తితులు ఏర్పడ్డాయి. అయితే ఇమ్రాన్ మృతిని ఆ దేశ ప్రభుత్వం ఖండించిన సంగతి తెలిసిందే. అయితే ఇమ్రాన్‌ఖాన్‌ను చూసేందుకు ఆయన కుటుంబసభ్యులను అనుమతించకపోవడం, అతని ఆరోగ్య పరిస్థితిపై ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో ఇమ్రాన్ పార్టీ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ కార్యకర్తలు దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు. మంగళవారం మాజీ ప్రధానికి అనుకూలంగా భారీ ర్యాలీకి రంగం సిద్ధం చేశారు. ఆందోళనకారులను అడ్డుకొనేందుకు ప్రభుత్వం రావల్పిండిలో సెక్షన్ 144 విధించింది. ప్రజా భద్రత దృష్ట్యా బుధవారం వరకు అన్ని బహిరంగ సభలు, ర్యాలీలు నిషేధిస్తూ.. ఉత్తర్వులు జారీ చేసింది. కొన్ని గ్రూపులు రావల్పిండిలో శాంతిభద్రతలకు భంగం కలిగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు జిల్లా ఇంటెలిజెన్స్ కమిటీ వెల్లడించింది. ఈ పరిణామాల వేళ ఇమ్రాన్‌ఖాన్ కుమారులు ఖాసీం, సులేమాన్ మీడియాతో మాట్లాడుతూ.. తమ తండ్రి విషయంలో ఏదో జరగకూడనిది జరిగినట్లు అనుమానం వ్యక్తంచేశారు. ఆయన సురక్షితంగా ఉన్నారా, లేదా ఆరోగ్యంగా ఉన్నారా, మరణించారా అనే విషయాలు వెల్లడించకుండా జైలు అధికారులు తమను మానసికంగా హింసిస్తున్నారన్నారు. కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ.. తమ తండ్రిని చూసేందుకు అనుమతించట్లేదన్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై తమకు ఎలాంటి సమాచారం అందట్లేదని ఆందోళన వ్యక్తం చేశారు. గత నెలన్నర రోజుల నుంచి ఆయనను ఎవరూ కలవకుండా 'డెత్ సెల్'లో ఒంటరిగా నిర్బంధించినట్లు వస్తున్న వార్తలు తమను ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. ఇమ్రాన్ ఖాన్ 2023 ఆగస్టు నుంచి అడియాలా జైలులో ఉన్న విషయం తెలిసిందే. అయితే, ఆయన మృతి చెందినట్లు సోషల్‌మీడియాలో ఒక్కసారిగా వదంతులు తెర పైకి వచ్చాయి. బలూచిస్థాన్ రెబల్స్‌కు చెందిన 'ఎక్స్' ఖాతాలో దీనికి సంబంధించిన పోస్ట్ చేసింది. పాక్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ అసీమ్ మునీర్, నిఘా విభాగం ఐఎస్ఐ కలిసి ఆయన్ని హతమార్చినట్లు వార్తలు వస్తున్నాయని రాసుకొచ్చింది. అలాగే పలు మీడియా సంస్థలు కూడా దీనికి సంబంధించి వార్తలను ప్రచురించినట్లు సామాజిక మాధ్యమాల్లో పలువురు పోస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో ఇమ్రాన్ సోదరీమణులు ఇటీవల జైలు వద్దకువెళ్లి ఆయనను కలిసేందుకు ప్రయత్నించగా.. పోలీసులు




# గంజాయి డాన్ కామాక్షమ్మకు చెక్


**• ఆమె ఐదు ఇళ్లను నేలమట్టం చేసిన జనం**

**నెల్లూరు,డిసెంబర్ 2:** నెల్లూరులో సీపీఎం నేత హత్య కేసులో ప్రధాన నిందితురాలు, గంజాయి మాఫియా లేడి డాన్ కామాక్షమ్మకు చెందిన ఐదు ఇళ్లను మంగళవారం స్థానికులు నేలమట్టం చేశారు. నేరస్తులను పెంచి పోషించడంతోపాటు గంజాయి మాఫియా నడుపుతూ.. కామాక్షమ్మ తమను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేసిందని ఈ సందర్భంగా స్థానికులు మండిపడ్డారు. తమ పిల్లలకు గంజాయి అలవాటు చేసి.. వారి జీవితాలతో చెలగాటం ఆడిందని వారు వాపోయారు. ఇదేమిటని ప్రశ్నించిన వారిపై ఆమె అనుచరులు తీవ్రంగా దాడి చేయడమే కాకుండా హత్యాయత్నాలకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచలయ్య హత్య కేసులో కామాక్షమ్మతోపాటు ఇతర నిందితులను కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.స్థానిక ఆర్డీటీ కాలనీలో కూల్చివేసిన ఇళ్లలో కామాక్షమ్మ తన తల్లి సోదరులతో నివాసం ఉంటుంది. ఈ కాలనీలోని నివాసాలను కేంద్రంగా చేసుకుని ఆమె పలు అరాచకాలకు పాల్పడిందని స్థానికులు వివరించారు. సీపీఎం నేత పెంచలయ్య హత్య కేసులో ప్రధాన నిందితులంతా కామాక్షమ్మతోపాటు ఆమె అనుచరులేనని స్థానికులు వివరిస్తున్నారు. కొన్ని ఏళ్లుగా కామాక్షమ్మతోపాటు ఆమె అనుచరులు ఇక్కడే ఉంటూ.. ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా వీరంతా.. యువతకు గంజాయి అలవాటు చేసి తమ నేర సామ్రాజ్యాన్ని విస్తరించారని పేర్కొన్నారు. నేపథ్యంలో కామాక్షమ్మ, ఆమె మరిదితోపాటు పలువురు అనుచరులపై వివిధ నేరాల కింద పోలీసులు కేసులు నమోదు చేశారని స్థానికులు వివరించారు. ఎన్నో ఏళ్లుగా ఆమె చేస్తున్న అరాచకాలు భరిస్తున్నామని పేర్కొన్నారు. ఇటీవల ఆమెను పోలీసులు అరెస్ట్ చేశారు.



# అతిశయోక్తులు, అవాస్తవాలు




విశాఖపట్టణంలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ నిర్మిస్తున్న ఒక గిగావాట్ హైపర్ స్కేల్ ఏఐ డేటా సెంటర్, మౌలిక సదుపాయాల ప్రాజెక్టు ఏర్పాటు గురించి నవంబర్ 19న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన గుత్తా రోహిత్ వ్యాసంలో అనేక అతిశయోక్తులు, అవాస్తవాలు ఉన్నాయి. మొదటగా గూగుల్ డేటా సెంటర్ ప్రాజెక్టులో అదానీ, ఎయిర్‌టెల్ కేవలం సహాయకులే (ఎనేబ్లర్లు) కానీ భాగస్వాములు కాదు. డేటా సెంటర్ స్థాపనకు అవసరమైన నిర్మాణాలు, గ్రీన్ ఎనర్జీ, మౌలిక వసతుల కల్పన అదానీ గ్రూప్ ఏర్పాటు చేస్తే, సముద్ర గర్భ కేబుల్స్, అంతర్జాతీయ డేటా ట్రాన్సిట్, అంతర్జాల సదుపాయాలను ఎయిర్‌టెల్ సమ కూరుస్తుంది. నిజానికి యూఎస్‌ఏలోని 50 రాష్ట్రాలలో 5,426 డేటా సెంటర్లు, చైనా, యూరోప్, సింగపూర్ తదితర దేశాలలో వందలాది డేటా సెంటర్లు ఉన్నాయి. భారతదేశంలో ప్రభుత్వ డిజిటల్ ఇండియా కార్యక్రమం, డేటా లోకలైజేషన్ విధానాలు, ఇంటర్నెట్ విస్తరణ, స్మార్ట్‌ఫోన్లు, ఈ%-%కామర్స్, డిజిటల్ సేవల విస్తరణ వల్ల డేటా ఉత్పత్తి పరిమాణం విపరీతంగా పెరిగి డేటా సెంటర్ పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ప్రపంచ డేటాలో భారత్ 20శాతం ఉత్పత్తి చేస్తున్నా, ప్రపంచ డేటా సెంటర్ సామర్థ్యంలో దాని వాటా కేవలం మూడు శాతం మాత్రమే. మన డేటా వేరే దేశాల్లో ఉండకూడదని ఇటీవల ప్రభుత్వం విధించిన నిబంధన వల్ల మన దేశంలో డేటా సెంటర్ల ఏర్పాటు అనివార్యం అయ్యింది.గూగుల్ అమెరికా వెలుపల ఇంత భారీ స్థాయి పెట్టుబడులతో భారతదేశంలో తొలి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్ విశాఖలో ఏర్పాటు చేయడం సామాన్య విషయం కాదు.

# రక్తదానం చేయండి ప్రాణాలు కాపాడండి

**● వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ ● వరంగల్‌లో బార్ అసోసియేషన్‌లో రక్తదాన శిబిరంలో పాల్గొన్న న్యాయవాదులు**





**వరంగల్ ,డిసెంబర్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రక్త దానంతో ఎందరో ప్రాణాలను కాపాడ వచ్చని, తలసేమియా, హిమోఫీలియా లాంటి రోగులకు రక్త దానం ఎంతో మేలు చేస్తుందని, రక్త దానం చేయండి ప్రాణాలు కాపాడండని న్యాయవా దులకు వరంగల్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ పిలుపునిచ్చారు. మంగళవారం వరంగల్ కోర్టు ప్రాంగణం డి ఎల్ ఎస్ సేవా సదన్ లో వరంగల్ డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ మరియు వరంగల్ డిస్ట్రిక్ట్ బార్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరం ప్రారంభించి ఆమె మాట్లాడారు. వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు నిర్మల గీతాంబ, పట్టాభి రామారావు న్యాయమూర్తులు ప్రసంగిస్తూ రక్తదానం వల్ల ఎంతోమంది ప్రాణాలు కాపాడబడుతాయని, రక్తదాన ఆవశ్యకత గురించి ప్రచారం చేసి కోర్టు ఆవరణలో వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వలుస సుధీర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం గొప్ప విషయమని అన్నారు. రక్తదాన శిబిరం ఒక సేవా కార్యక్రమమే కాకుండా, మానవతకి ప్రతీకని న్యాయవాదులు న్యాయం కోసం పోరాడడంతో పాటు సామాజిక బాధ్యతతో రక్తదానం చేయడం సమాజానికి మంచి సందేశం ఇస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వలుస సుధీర్ ప్రసంగిస్తూరక్తం కొరత తీవ్రంగా పెరుగుతున్న తరుణంలోథలసీమియా పిల్లలు, అత్యవసర శస్త్రచికిత్సలు,క్యాన్సర్, ప్రమాద బాధితులుప్రాణాలు చేతిలో పెట్టుకొని రక్తానికై ఎదురు చూస్తున్నారని,మన దేహం నుంచి వెలువడే ఒక యూనిట్ రక్తం మూడు ప్రాణాలకు వెలుగునిస్తుందని రక్తం ఇవ్వండం ప్రాణాన్ని నిలబెట్టడం మనిషితనమని, మానవత్వానికి ప్రతీకని అన్నారు. ప్రతివారు రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి సాయి కుమార్, న్యాయమూర్తులు క్షమా దేశ్ పాండే, రామలింగం, నారాయణ బాబు, ఉషా క్రాంతి, పూజ, నందికొండ రితిక, హారిక, వెంకట చంద్ర ప్రసన్న, వరంగల్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మైదం జయపాల్, ప్రధాన కార్యదర్శి డి. రమాకాంత్, సంయుక్త కార్యదర్శి ముసిపట్ల శ్రీధర్, మహిళా సంయుక్త కార్యదర్శి రేవూరి శశిరేఖ, హనుమకొండ బార్ మహిళా సంయుక్త కార్యదర్శి, కోశాధికారి సిరిమల్ల అరుణ, వరంగల్, హనుమకొండ గ్రంథాలయ కార్యదర్శులు గుండ కిషోర్, వెంకట్, సీనియర్ ఇ.సి మెంబర్ ఇజ్జగిరి సురేష్, మహిళా సీనియర్ ఇ.సి కళకోట్ల నిర్మల జ్యోతి, ఇ.సీ సభ్యులు మర్రి రాజు, జాటోతు రవి, తోట అరుణ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హన్మకొండ శాఖ పాలకవర్గ సభ్యులు పుల్లూరి వేణుగోపాల్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జె కిషన్ రావు, బ్లడ్ డోనర్ మోటివేటర్ గంధసిరి శ్రీనివాస్, మడిపల్లి ఆనంద్ గౌడ్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేసారు. రక్తదానం చేసిన 60 మంది న్యాయవాదులకు ప్రతి సభ్యునికి పండ్లు పంపిణీ చేసి సర్టిఫికేట్లు ఇచ్చి అభినందనలు తెలిపారు. రక్తంతో ప్రాణాలను కాపాడే ఈ సేవలో పాల్గొన్న అందరికీ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.

# టీబీ నియంత్రణకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలి

**● హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**




**హన్మకొండ,డిసెంబర్ 2 (పిసిడబ్ల్యూ న్యూస్)** :హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో పట్టణ ఆరోగ్య కేంద్రాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సిబ్బందితో ఆరోగ్య కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్దేశించిన మార్గ దర్శకాలకు అనుగుణంగా స్క్రీనింగ్ పరీక్షలు పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో పట్టణ పరిధిలోని బోడగుట్ట, సోమిడి వడ్డేపల్లి, లష్కర్ సింగారం, పెద్దమ్మ గడ్డ పట్టణ ఆరోగ్య కేంద్రాలు, హసన్ పర్తి, కడిపికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సిబ్బందితో ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో 1,98,000 ప్రభావిత గ్రూపులకు చెందిన వారిని పరీక్షించి అవసరమైన పరీక్షలు నిర్వహించవలసి ఉండగా1,30,049 మందికి స్క్రీనింగ్ నిర్వహించడం జరిగింది. స్క్రీనింగ్ తక్కువగా నిర్వహించిన వడ్డేపల్లి, లష్కర్ సింగారం , కడిపికొండ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులను ఇందుకు గల కారణాలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ దేశంలో టీబీ నిర్మూలన లక్ష్యంగా ఈ కార్యక్రమం టీబీ ముక్త్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో టీబీ నియంత్రణ కార్యక్రమాలకు యాక్షన్ ప్లాన్ తయారు చేసుకుని దానికి అనుగుణంగా స్క్రీనింగ్, ఎక్స్ రే, నాట్ పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం అందించిన మొబైల్ ఎక్స్ రే మిషన్ ను పరిశీలించి ప్రణాళిక ప్రకారం ఎక్కడైతే ఎక్స్ రే పరీక్షలు తక్కువగా నిర్వహించారో అక్కడి ప్రజలకు అవగాహన కల్పించి ఎక్స్ రే పరీక్షలు నిర్వహించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో స్క్రీనింగ్ బాగానే చేస్తున్నప్పటికీ పట్టణ పరిధిలో మాత్రం చాలా తక్కువగా ఉందని అన్నారు. పట్టణ ప్రాంతాల లో కూడా స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహించాలని సూచించారు. వైద్యాధి కారులు, సిబ్బంది సమయ పాలన పాటించాలని పేర్కొన్నారు. అందు బాటులో ఉన్న సిబ్బంది, వనరులతో టిబి ముక్త్ భారత్ ఎన్సిడి, మాతా శిశు సంక్షేమంతో పాటు ఇతర అన్ని ఆరోగ్య కార్య క్రమాలు లక్ష్యాలను సాధించాలని, లేనట్లయితే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య టీబీ ముక్త్ భారత్, గర్భిణీ స్త్రీల నమోదు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య తక్కువగా ఉన్న ఆరోగ్య కేంద్రాల ఏఎన్ఎం లు, ఆశాలవారీగా సమీక్షించి కారణాలను తెలుసుకొని వాటిని అధిగమించి లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. 100 శాతం ప్రసవాలను ప్రభుత్వ ఆసుపత్రిలోనే జరగడానికి ప్రోత్సహించిన ఆరుగురు ఆశాలను శాలువాలతో సత్కరించారు. ఈ సమావేశంలో అడిషనల్ డిఎంహెచ్వో డాక్టర్ మదన్ మోహన్ రావు, టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ హిమబిందు, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ ప్రదీప్ రెడ్డి, పీవోడిటి డాక్టర్ ప్రభుదాస్, జ్ఞానేశ్వర్, డెమో వి. అశోక్ రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేయాలి



**సర్పంచ్ అభ్యర్థుల గెలుపుకు యూత్ కాంగ్రెస్ కృషి చేయాలి**

**- యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మలపెల్లి సందీప్**

**నర్సంపేట డిసెంబర్ 02 :** ఈనెల 5న నర్సంపేటలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకు యూత్ కాంగ్రెస్ నాయకులు కృషి చేయాలని నర్సంపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మలపెల్లి సందీప్ అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత నర్సంపేట నియోజకవర్గ శాసనసభ్యులు పెద్దలు దొంతి మాధవరెడ్డి ఆశీస్సులతో నర్సంపేట స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన యుత్ కాంగ్రెస్ సమావేశంలో నర్సంపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మలపెల్లి సందీప్ మాట్లాడుతూ నియోజకవర్గంలో విద్యా, వైద్యం, రోడ్లు, త్రాగునీరు, సాగునీరు, మరియు పలు ప్రభుత్వ రంగ సంస్థల భవనాల నిర్మాణాలను చేపట్టి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలనే గొప్ప సంకల్పంతో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి , రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో మాట్లాడి వారిని ఒప్పించి మెప్పించి నియోజకవర్గ అభివృద్ధికి 1000 కోట్ల నిధులను తీసుకొచ్చి ఈనెల 5న సీఎం రేవంత్ రెడ్డి చేతుల శంకుస్థాపన పనులను ప్రారంభోత్సవం చేసుకోబోతున్న సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి గారికి ప్రత్యేక కృతజ్ఞతలను తెలియజేస్తున్నానని అన్నారు, నియోజకవర్గంలో సీఎం రేవంత్ రెడ్డి మొదటి సభను విజయవంతం చేయవలసిందిగా యూత్ కాంగ్రెస్ నాయకులకు పిలుపునిచ్చారు, అదే విధంగా నియోజకవర్గంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపుకు యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రమించాలని రాష్ట్రంలోనే అత్యధిక సర్పంచ్ స్థానాలను మన నియోజకవర్గంలో గెలిపించుకొని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి గౌరవ ప్రతిష్టలు రాష్ట్రవ్యాప్తంగా చాటే బాధ్యత ప్రతి యూత్ కాంగ్రెస్ నాయకుడిపై ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ జాయింట్ సెక్రెటరీ మోడెం ఎల్లగౌడ్, వరంగల్ జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రూపిక శ్రావణ్ కుమార్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పల్స ప్రశాంత్ గౌడ్, నర్సంపేట పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్కే షఫిక్, నర్సంపేట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొంత రంజిత్, చెన్నారావుపేట మండల యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద నరేష్, ఖానాపూర్ మండల యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బొల్లం హరీష్, యూత్ కాంగ్రెస్ నాయకులు గద్ద అఖిల్, మహమ్మద్ సల్మాన్, దేశి సాయి పటేల్, మచ్చకంటి మనోజ్ కుమార్, మంచాల హరీష్, గద్ద నిఖిల్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ అనంతరం సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి

**● వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**



**హన్మకొండ,డిసెంబర్ 2 :** పదవీ విరమణ అనంతరం పోలీస్ సిబ్బంది సేవా కార్య క్రమాలకు సమయం కేటాయి ంచాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ విభాగంలో సుధీర్ఘ కాలం విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన పోలీస్ అధికారుల మంగళవారం ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సుధీర్ఘ కాలం పాటు పోలీస్ శాఖ కు సేవలందించిన పదవీ విరమణ చేస్తున్న అధికారులు నేటి తరం పోలీసులకు ఆదర్శంగా నిలుస్తారని పదవీ విరమణ అనంతరం పోలీస్ సిబ్బంది ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని పదవీ విరమణ తర్వాత ప్రభుత్వం నుండి అందే డబ్బును భవిష్యత్తు అవసరాలకు భద్ర పర్చుకోవాలని సీపీ సూచించారు.ో అదనపు డిసిపిలు రవి, సురేష్ కుమార్, శ్రీనివాస్, ఏసీపీ, సురేంద్ర, ఆర్.ఐ సతీష్, స్పర్జన్ తో పాటు, ఇతర పోలీస్ సిబ్బంది, పదవీ విరమణ సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# మంత్రి వివేక్‌కు జన్మదిన శుభాకాంక్షలు



**హన్మకొండ,డిసెంబర్ 2 :** టిపిసిసి ఉపాధ్యక్షుడు బందెల రాజ భద్రయ్య ఆధ్వర్యంలో మంత్రి వివేక్ వెంకటస్వామి జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాల మానాడు అధ్యక్షులు గోల అరుణ్ కుమార్ తెలంగాణ మాల మహానాడు మహిళా అధ్యక్షురాలు బందెల యాదలక్ష్మి హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు రాజ కుమార్ సికింద్రాబాద్ అధ్యక్షులు మంచాల దామోదర్ సర్దార్ రాజశేఖర్ ఎల్లావుల రాజేందర్ యాదవ్ మానుపాటి పార్థు వల్లెపు నితిన్ రెడ్డి రాజారావు అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఒంగోలు ఆర్ట్ ఫెస్ట్‌కి సాగంటి చిత్రం ఎంపిక





**హన్మకొండ,డిసెంబర్ 2 :**డిసెంబర్ 3,4,5 తేదీలలో హైదరాబాద్ ఫైన్ ఆర్ట్స్ కాలేజీ కేంద్రంగా కళాయజ్ఞ సృష్టికర్త ఏలూరి శేష బ్రహ్మం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఒంగోలు ఆర్ట్ ఫెస్ట్-2025 (ఆర్ట్ ఎగ్జిబిషన్) లో హన్మకొండ కు చెందిన ప్రముఖ చిత్ర కారిణి, విద్యా కళాశాల అధ్యాపకురాలు, సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ మంజుల సాగంటి కుంచె నుండి ప్రాణం పోసుకున్న చిత్రం ఎంపిక అయింది. "భారత దేశ సంప్రదాయ గృహాలు" అనే ప్రత్యేక అంశం పై రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 100 మంది ప్రముఖ ఆర్టిస్టులు పాల్గొనే ఈ ప్రదర్శన కు తన చిత్రం ఎంపిక కావడం గర్వ కారణం అని మంజుల సంతోషాన్ని మీడియాతో పంచుకున్నారు. ప్రస్తుతం కాంక్రీటు గోడల్లో ఉంటున్న సమాజానికి ప్రాచీన సంప్రదాయ రీతుల్లో కట్టిన నివాసాలు ఎలా ఉండేవో తెలియజేసే ఈ ప్రదర్శనకు ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల ముఖ్య అతిథిగా రానున్నారని అందు బాటులో ఉండి, ఆసక్తి కలిగిన ప్రతి ఒక్కరు ఆహ్వానితులే అని మంజుల తెలిపారు.

# వెల్లంపల్లి సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ - బీఆర్ఎస్ మధ్యే ప్రధాన పోరు




**పరకాల, డిసెంబర్ 02** పరకాల మండలం వెల్లంపల్లి గ్రామంలో సర్పంచ్ ఎన్నికల వేడి మొదలైంది. గ్రామ రాజకీయ వర్గాల్లో ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ముందంజ ఉన్నట్లు స్థానిక వర్గాల అభిప్రాయం. గతంలో దాదాపు 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీకి రెండో ప్రాధాన్యత ఇస్తున్నట్టుగా గ్రామస్తులు భావిస్తు న్నారు. ఇక భారతీయ జనతా పార్టీ విషయానికి వస్తే,... ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో డిపాజిట్ కూడా రాకపోవడం ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు. దీనివల్ల స్థానిక ప్రజల అంచనా ప్రకారం బీజేపీ మూడో స్థానానికే పరిమితమయ్యే అవకాశం కనిపిస్తోంది. అదే సమయంలో, సర్పంచ్ పదవికి పోటీలో ఉన్న అభ్యర్థులలో స్థానికంగా ఉంటూ ప్రజలతో మమేకమై పనిచేసే అభ్యర్థికే మద్దతు ఇవ్వాలని గ్రామంలోని విద్యావేత్తలు, మేధావులు, యువతరం చర్చించుకుంటున్నారు. ప్రజల్లో మంచి పేరు, సేవా భావం ఉన్న నాయకుడే గ్రామ అభివృద్ధికి దోహదపడతాడన్న నమ్మకం వ్యక్తమవుతోంది. మరికొద్ది రోజుల్లో జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలా? లేక ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్‌కు అవకాశమివ్వాలా? అన్నది గ్రామ రాజకీయాల్లో ప్రధాన చర్చాంశంగా మారింది. ముఖ్యంగా వెల్లంపల్లి సర్పంచ్ స్వతంత్ర అభ్యర్థులకు కనీసం 10 ఓట్లయినా పడతాయా లేదో అని ప్రజలు హేళనగా అనుకుంటున్నారు. ఎన్నికల వేళ వెల్లంపల్లి రాజకీయ సమీకరణాలు ఎలా మారతాయో ఆసక్తికరంగా మారింది.

# వన్డేలలో అత్యధిక సిక్సర్లు కొట్టి ప్రపంచ రికార్డు



టీమిండియా ఓపెనర్ రోహిత్ శర్మ ఇప్పుడు వన్డే ఇంటర్నేషనల్స్ లో చరిత్రలో అరుదైన ఘనత సాధించాడు. 50 ఓవర్ల ఫార్మాట్లో అత్యధిక సిక్సర్లు కొట్టిన బ్యాటర్‌గా నిలిచాడు. రోకో వన్డే కెరీర్ ఏంటని ప్రశ్నించే వారికి దిగ్గజాలు వారి బ్యాటుతోనే సమాధానం చెబుతున్నారు. కుర్రాళ్ల కంటే వేగంగా, నిలకడగా పరుగులు సాధిస్తున్నారు. క్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలి వన్డేలో హిట్ మ్యాన్ రోహిత్ శర్మ ఈ ఘనత సాధించాడు. 19.4వ బంతిని రోహిత్ సిక్సర్ కొట్టాడు. మార్కో జాన్సన్ వేసిన బంతిని సిక్సర్ గా మలచడంతో ఇది రోహిత్ కెరీర్ లో 352వ సిక్స్. తద్వారా షాహిద్ అఫ్రిది రికార్డును బద్దలుకొడుతూ భారత ఓపెనర్ సిక్సర్ల కింగ్ గా మారాడు. అభిమానులు ముద్దుగా పిలుచుకునే 'హిట్‌మాన్' తొలి వన్డేలో సఫారీ బౌలర్ మార్కో జాన్సెన్‌పై తన 352వ సిక్స్ కొట్టాడు. ఇటీవల జరిగిన టెస్ట్ సిరీస్‌లో భారత బ్యాటింగ్ లైనప్‌ను బాగా ఇబ్బంది పెట్టిన జాన్సెన్ బౌలింగ్ లో బౌండరీ దాటించి వన్డే చరిత్రలో అరుదైన బ్యాటర్ అయ్యాడు. సుబ్రాయెన్ బౌలింగ్ లో రోహిత్ వరుసగా రెండో సిక్సర్ కొట్టాడు. దాంతో రోహిత్ ఇప్పుడు వన్డేల్లో అత్యధిక సిక్సర్లు బాదిన అఫ్రిది రికార్డును సమం చేశాడు. డీప్ మిడ్-వికెట్ వైపు నెయిల్ స్లాగ్-స్వీప్‌తో సిక్సర్ బాదేశాడు. బ్రాయెన్ బౌలింగ్ లో ఓవర్ తొలి బంతిని రోహిత్ సిక్సర్ గా మలిచాడు. ఆఫ్ స్టంప్ నుండి బాగా దూరంగా వెళ్తున్న బంతిని రోహిత్ స్లాగ్-స్వీప్‌లోకి చేరుకుని మిడ్ వికెట్ మీదుగా సిక్స్ కొట్టాడు. వన్డేల్లో రోహిత్ కిది 350వ సిక్స్. ఈ మ్యాచులో హిట్ మ్యాన్ తన ఫాం కొనసాగించాడు. ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగిన చివరి రెండు వన్డేలో కీలక ఇన్నింగ్సులు ఆడిన రోహిత్ దక్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలి వన్డేలోనూ వరుస హాఫ్ సెంచరీతో రాణించాడు. కేవలం 43 బంతుల్లో హాఫ్ సెంచరీ చేసిన రోహిత్ శర్మ స్కోరు వేగాన్ని పెంచే క్రమంలో ఔటయ్యాడు. మార్కో జాన్సెన్ బౌలింగ్ లో ఎల్బీడబ్ల్యూ అయ్యాడు. 51 బంతుల్లో 57 పరుగులు చేసి రెండో వికెట్ రూపంలో హిట్ మ్యాన్ నిష్క్రమించాడు. అయితే కోహ్లీతో కలిసి రెండో వికెట్ కు శతక (136 పరుగుల) భాగస్వామ్యం నెలకొల్పాడు.

# అర్జున్ టెండూల్కర్ ఆల్ రౌండర్ షో



క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్ టెండూల్కర్ ఆల్-రౌండర్‌గా తన ఆటతీరుతో ఆకట్టుకుంటున్నాడు. దేశీయ టీ20 టోర్నమెంట్ అయిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో గోవా జట్టు తరపున ఆడుతున్న అర్జున్, మధ్యప్రదేశ్‌పై జట్టుకు అద్భుత విజయాన్ని అందించాడు. ఈ లెఫ్ట్ హ్యాండ్ బౌలర్ పవర్‌ప్లేలో అద్భుతమైన స్పెల్‌తో కీలక వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి జట్టును కట్టడి చేయడంలో ముఖ్యపాత్ర పోషించాడు. గోవా జట్టు ఈ మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. అర్జున్ బౌలింగ్, బ్యాటింగ్‌తో ఈ సీజన్‌లో గోవా తమ రెండో విజయాన్ని నమోదు చేసింది. మధ్యప్రదేశ్ మొదట బ్యాటింగ్ చేసి 170 పరుగులు చేసింది. కానీ అర్జున్ టెండూల్కర్ పవర్‌ప్లేలో వేసిన కీలకమైన స్పెల్ కారణంగా వారు మరింత పెద్ద స్కోరు చేయలేకపోయారు. గోవా తరపున తొలి ఓవర్‌ను వేసిన అర్జున్, ఐదో బంతికే శివాంగ్ కుమార్ను డకౌట్ చేసి ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాతి ఓవర్‌లోనే మరో కీలక వికెట్ అంకుష్ సింగ్ను కూడా అవుట్ చేశాడు. చివరి ఓవర్లలో కొంచెం ఎక్కువ పరుగులు ఇచ్చినా, అతను వెంకటేష్ అయ్యర్‌ను కేవలం 6 పరుగులకే అవుట్ చేసి తన మూడో వికెట్‌ను సాధించాడు. ఈ మ్యాచ్‌లో గోవా తరఫున అర్జున్ బెస్ట్ బౌలింగ్ పర్ఫామెన్స్ (3 వికెట్లు) చేసింది అర్జున్ టెండూల్కరే. మధ్యప్రదేశ్ తరఫున హర్‌ప్రీత్ సింగ్ అజేయంగా 80 పరుగులు చేయగా, కెప్టెన్ రజత్ పాటిదార్ 29 పరుగులు, ఆఖర్లో అంకిత్ వర్మ 4 సిక్సర్ల సహాయంతో 34 పరుగులు చేశారు. మధ్యప్రదేశ్ విధించిన 170 పరుగుల లక్ష్యాన్ని గోవా 18.3 ఓవర్లలో సులభంగా ఛేదించింది. బౌలింగ్‌లో అద్భుత ప్రదర్శన తర్వాత, అర్జున్ టెండూల్కర్ ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్‌గా కూడా బరిలోకి దిగాడు. బ్యాటింగ్‌కు రాగానే మూడు ఫోర్లు కొట్టి దూకుడు చూపినా, 16 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద తిరుపరేష్ సింగ్ బౌలింగ్‌లో అవుట్ అయ్యాడు. ఆ తర్వాత అభినవ్ తల్వారేజా, కెప్టెన్ సుయష్ ప్రభుదేసాయి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు.

# రెండో వన్డేకు అంతా రెడీ



## మళ్లీ రో-కోపైనే అందరి కళ్లు!

## మరో ఆసక్తికర పోరుకు సిద్ధం


## నేడు రాయ్‌పూర్ వేదికగా రెండో వన్డే

సౌతాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్‌లో శుభారంభం చేసిన టీమిండియా.. మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైంది. నేడు రాయ్‌పూర్ వేదికగా జరిగే రెండో వన్డేలో ఇరు జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. తొలి వన్డే తరహాలోనే రెండో మ్యాచ్‌లోనూ విజయం సాధించి మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ కైవసం చేసుకోవాలని టీమిండియా భావిస్తోంది. తద్వారా ఆఖరి మ్యాచ్‌లో బెంచ్ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలనే యోచనలో ఉంది. మరోవైపు తొలి వన్డేలో ఓటమి విజయాన్ని చేజార్చుకున్న సౌతాఫ్రికా.. రెండో మ్యాచ్‌లో విజయం సాధించి సిరీస్ రేసులో నిలవాలనే పట్టుదలతో ఉంది. తొలి మ్యాచ్‌లో కోహ్లీ సెంచరీతో చెలరేగడం.. రోహిత్ శర్మ హాఫ్ సెంచరీతో సత్తా చాటడంతో అప్‌కమింగ్ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది.ఇప్పటికే ఇరు జట్లు రాయ్‌పూర్ చేరుకొని ప్రాక్టీస్ కూడా మొదలుపెట్టాయి. అయితే తొలి వన్డేలో రిషభ్ పంత్‌ను పక్కనపెట్టి రుతురాజ్ గైక్వాడ్‌ను ఆడించడం విమర్శలకు దారి తీసింది. ఈ అవకాశాన్ని రుతురాజ్ గైక్వాడ్ సద్వినియోగం చేసుకోలేకపోయాడు. అతను దేశవాళీ క్రికెట్ ఫామ్‌ను కొనసాగించలేకపోయాడు. అయితే రుతురాజ్ గైక్వాడ్‌కు మరో అవకాశం ఇస్తారా లేక రిషభ్ పంత్‌ను తుది జట్టులోకి తీసుకొస్తారా అనేది చూడాలి. ఒకవేళ పంత్‌ను ఆడించాలనుకుంటే రుతురాజ్ బెంచ్‌కు పరిమితమవుతాడు. ఈ ఒక్క మార్పు మినహా తుది జట్టును మార్చే అవకాశాలు లేవు.ఓపెనర్లుగా యశస్వి జైస్వాల్, రోహిత్ శర్మ బరిలోకి దిగనున్నారు. తొలి వన్డేలో యశస్వి జైస్వాల్ నిరాశపర్చాడు. శుభ్‌మన్ గిల్ గైర్హాజరీలో అతనికి వచ్చిన అవకాశాన్ని చేజార్చుకున్నాడు. కనీసం ఈ మ్యాచ్‌లోనైనా అతను సత్తా చాటాలి. మరోవైపు రోహిత్ శర్మ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. ఫస్ట్ డౌన్‌లో విరాట్ కోహ్లీ బరిలోకి దిగనున్నాడు. తొలి వన్డేలో అద్భుత శతకంతో కోహ్లీ రెట్టించిన ఉత్సాహంతో ఉన్నాడు.నాలుగో స్థానంలో రుతురాజ్ గైక్వాడ్, రిషభ్ పంత్‌ల్లో ఒకరు బరిలోకి దిగనున్నారు. వాషింగ్టన్ సుందర్ ఐదో స్థానంలో ఆడనుండగా.. కేఎల్ రాహుల్ ఆరో స్థానంలో బ్యాటింగ్ చేయనున్నాడు. సుందర్ విఫలమైనా.. రాహుల్ హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. ఏడో స్థానంలో జడేజా దూకుడుగా ఆడి విలువైన పరుగులు జోడించాడు.స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్ ఆడనుండగా.. హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిధ్ కృష్ణలు పేసర్లుగా కొనసాగనున్నారు. తెలుగు తేజం నితీష్ కుమార్ రెడ్డితో పాటు ధ్రువ్ జురెల్, తిలక్ వర్మకు నిరాశే ఎదురవ్వనుంది. ఆల్‌రౌండర్ కోటాలో ఆడాల్సిన నితీష్ కుమార్ రెడ్డి పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతుండటంతో పక్కనపెట్టేసారు. అతని స్థానంలో హర్షిత్ రాణాను ఆడిస్తున్నారు. హర్షిత్ రాణా తొలి వన్డేలో 3 వికెట్లతో సత్తా చాటాడు. అయితే రాంచీ వన్డేలో 349 స్కోర్ చేసినా, భారత్ అతి కష్టంమీద నెగ్గిందనడంలో సందేహం లేదు. భారీ ఛేదనలో సౌతాఫ్రికా ఇన్నింగ్స్ ప్రారంభంలోనే 3 కీలక వికెట్లు కోల్పోయినా, మ్యాచ్ అక్కడదాకా వచ్చిందంటే మన బౌలింగ్ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. రాయ్‌పూర్ పిచ్ స్పిన్నర్లతోపాటు పేసర్లకు కూడా అనుకూలమే. హర్షిత్ రాణా, అర్ష్‌దీప్, కుల్దీప్ వికెట్లు తీసినా భారీగా పరుగులు ఇచ్చుకున్నారు. తొలి మ్యాచ్‌లో నుంచి పాఠాలు నేర్చుకొని, అవి రిపీట్ కాకుండా చూడాల్సిన బాధ్యత బౌలర్లదే.ప్రత్యర్థి సౌతాఫ్రికా రాంచీ మ్యాచ్‌లో ఓడినా, వాళ్లు పోరాడిన తీరు అందర్నీ ఆకట్టుకుంది. ఓవైపు వికెట్లు పడుతున్నా ఆఖరు బ్యాటర్ దాకా పోరాడారు. ఆ రోజు టార్గెట్ ఓ 30 పరుగులు తక్కువ ఉంటే ఫలితం మారేదేమో! ఇక తొలి వన్డేలో ఓటమితో సౌతాఫ్రికా, రెండో మ్యాచ్‌కు మరింత సన్నద్ధంగా తిరిగి వస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. బార్ట్‌మాన్, సుబ్రయెన్, బర్గర్ బౌలింగ్‌లో కీలకం కానుండగా, మార్‌క్రమ్, డికాక్, రికెల్టన్, టోనీ జార్జిలతో సౌతాఫ్రికా బలంగా కనిపిస్తుంది. ఇక ఆల్‌రౌండర్ మార్కో యాన్సెన్ ఆ జట్టుకు అతిపెద్ద బలంగా ఉన్నాడు. అతడిని ఎదుర్కోవడం భారత్‌కు పెద్ద సవాల్ కానుంది.రాయ్‌పూర్ పిచ్ బ్యాటర్స్‌గా ఉంటుంది. తొలి మ్యాచ్‌లాగానే ఇందులోనూ భారీ స్కోర్లు నమోదు అయ్యే అవకాశాలు ఉన్నాయి. స్పిన్నర్లు, పేసర్లు ఇద్దరూ ఈ పిచ్‌పై ప్రభావం చూపుతారు. భారత్‌లోని అతిపెద్ద మైదానాలలో రాయ్‌పూర్ స్టేడియం ఒకటి. బౌండరీ లైన్లు చాలా దూరంగా ఉంటాయి.

సౌతాఫ్రికాతో తొలి వన్డే తుది జట్టు(అంచనా)రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ, రిషభ్ పంత్/రుతురాజ్ గైక్వాడ్, వాషింగ్టన్ సుందర్, కేఎల్ రాహుల్(కెప్టెన్), రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, నితీష్ కుమార్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా. రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ, తిలక్ వర్మ, కేఎల్ రాహుల్(కెప్టెన్), కీపర్, రిషభ్ పంత్ (కీపర్), వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, నితీష్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా, రుతురాజ్ గైక్వాడ్, ప్రసిధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్, ధ్రువ్ జురెల్.

# మ్యాక్స్‌వెల్ ఐపీఎల్‌కు గుడ్‌బై

ఆస్ట్రేలియా విధ్వంసకర బ్యాటర్ గ్లేన్ మ్యాక్స్‌వెల్ కూడా ఐపీఎల్‌కు గుడ్‌బై చెప్పాడు. ఐపీఎల్ 2026 మినీ వేలానికి తన పేరును రిజిస్టర్ చేసుకోలేదని తెలిపాడు. క్రికెటర్‌గా ఎదిగేందుకు ఐపీఎల్ తనకు ఎంతో ఉపయోగపడిందని, వరల్డ్ క్లాస్ ప్లేయర్లతో ఆడే అవకాశం దక్కిందని సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్‌ను పంచుకున్నాడు. ఐపీఎల్ అభిమానుల ప్రేమ వెల కట్టలేనిదని, తనకు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు చెప్పాడు. ఐపీఎల్ రిటైర్మెంట్ గురించి ప్రస్తావించకపోయినా.. హింట్ ఇచ్చాడు. 'ఐపీఎల్‌లో ఎన్నో మరవురాని సీజన్స్ తర్వాత ఈ ఏడాది వేలంలో నా పేరును రిజిస్టర్ చేసుకోవద్దని నిర్ణయించుకున్నాను. ఇది చాలా పెద్ద నిర్ణయం. ఈ లీగ్ నాకు ఇచ్చిన ప్రతిదానికి ఎంతో కృతజ్ఞతతో ఈ నిర్ణయం తీసుకుంటున్నా. ఒక క్రికెటర్‌గా ఎదిగేందుకు నాకు ఐపీఎల్ ఎంతో ఉపయోగపడింది. వరల్డ్ క్లాస్ ప్లేయర్లతో పాటు అద్భుతమైన ఫ్రాంచైజీలకు ప్రాతినిథ్యం వహించే అవకాశం కల్పించింది. క్రికెట్ అంటే ఎంతో అభిరుచి గల అభిమానుల ముందు ఆడే అవకాశాన్నిచ్చింది. ఐపీఎల్‌లోని జ్ఞాపకాలు, సవాళ్లు, భారత అభిమానుల ఉత్సాహం నాతో శాశ్వతంగా ఉంటాయి. ఇన్నేళ్లుగా మీరు అందించిన మద్దతుకు ధన్యవాదాలు. మళ్లీ త్వరలో కలుస్తామని ఆశిస్తున్నాను'అని మ్యాక్స్‌వెల్ తన పోస్ట్‌లో పేర్కొన్నాడు. ఇప్పటికే ఆండ్రీ రస్సెల్, ఫాఫ్ డుప్లెసిస్ ఐపీఎల్‌కు గుడ్ బై చెప్పిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ జాబితాలో మ్యాక్స్‌వెల్ చేరాడు. వేలంలో అమ్ముడుపోయిని గ్రహించే ఈ ముగ్గురు ఆటగాళ్లు మినీ ఆక్షన్‌కు దూరంగా ఉన్నారని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. 2012లో ఢిల్లీ క్యాపిటల్స్‌తో ఐపీఎల్ కెరీర్ ప్రారంభించిన మ్యాక్స్‌వెల్ ముంబై ఇండియన్స్(2013), పంజాబ్ కింగ్స్ (2014-2017, 2020-21, 2025), ఢిల్లీ క్యాపిటల్స్ (2018) రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(2021-2024) మొత్తం నాలుగు జట్లకు ప్రాతినిథ్యం వహించాడు. ఈ నాలుగు జట్ల తరఫున 141 మ్యాచ్‌లు ఆడిన మ్యాక్స్‌వెల్ 23.88 సగటుతో 2819 పరుగులు చేశాడు. ఇందులో 18 హాఫ్ సెంచరీలున్నాయి. పంజాబ్ కింగ్స్ తరఫున గత సీజన్‌లో 7 మ్యాచ్‌లు ఆడిన మ్యాక్స్‌వెల్ 48 పరుగులే చేసాడు.



# చరిత్ర సృష్టించిన వైభవ్ సూర్యవంశీ



టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ చరిత్ర సృష్టించాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో సెంచరీ బాదిన అత్యంత పిన్నవయస్కుడిగా నిలిచాడు. ఈ ప్రతిష్టాత్మక దేశవాళీ టీ20 టోర్నీలో బీహార్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న వైభవ్ సూర్యవంశీ కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా మహారాష్ట్రతో జరిగిన మ్యాచ్‌లో సెంచరీతో చెలరేగాడు. ఈ టోర్నీలో వరుసగా మూడు మ్యాచ్‌ల్లో విఫలమైన సూర్యవంశీ.. నాలుగో మ్యాచ్‌లో 61 బంతుల్లో 7 ఫోర్లు, 7 సిక్స్‌లతో 108 పరుగులు చేశాడు.ఈ సెంచరీతో సూర్యవంశీ 12 ఏళ్ల రికార్డ్‌ను బద్దలు కొట్టాడు. 2013లో మహారాష్ట్ర బ్యాటర్ విజయ్ జోల్ 18 ఏళ్ల 118 రోజుల వయసులో (109) సెంచరీ చేసి అతిపిన్నవయస్కుడిగా నిలిచాడు. ఇన్నాళ్లు చెక్కు చెదరకుండా ఉన్న ఈ రికార్డ్‌ను వైభవ్ సూర్యవంశీ బద్దలు కొట్టాడు. 14 ఏళ్ల 250 రోజుల వయసులో సూర్యవంశీ 108 పరుగులు చేసి ఈ ఫీట్ సాధించాడు. ఈ జాబితాలో వైభవ్ సూర్యవంశీ తర్వాత ఆయుష్ మాత్రే(18 ఏళ్ల 135 రోజులు), ఆయుష్ మాత్రే(18 ఏళ్ల 137 రోజులు), షేక్ రషీద్(19 ఏళ్ల 25 రోజులు) ఉన్నారు.భారత్ తరఫున టీ20ల్లో మూడు సెంచరీలు నమోదు చేసిన అత్యంత పిన్నవయస్కుడిగా కూడా వైభవ్ సూర్యవంశీ నిలిచాడు. ఈ క్రమంలో తిలక్ వర్మ పేరిట ఉన్న రికార్డ్‌ను బద్దలు కొట్టాడు. వైభవ్ సూర్యవంశీ 14 ఏళ్ల 250 రోజుల వయసులో ఈ ఫీట్ అందుకుంటే తిలక్ వర్మ(22 ఏళ్ల 7 రోజుల వయసు), దేవదత్ పడిక్కల్(22 ఏళ్ల 96 రోజులు), యశస్వి జైస్వాల్(22 ఏళ్ల 126 రోజులు), అహ్మద్ షేహ్‌జాద్(22 ఏళ్ల 127 రోజులు), ఉన్ముక్త్ చంద్(22 ఏళ్ల, 295 రోజులు) తర్వాత ఉన్నారు. ఐపీఎల్ 2025 సీజన్‌లో గుజరాత్ టైటాన్స్‌పై 35 బంతుల్లో సెంచరీ బాదిన వైభవ్ సూర్యవంశీ.. రైజింగ్ ఆసియా కప్ టోర్నీలో భారత్- ఏ తరఫున 32 బంతుల్లో శతకం నమోదు చేశాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో తాజా శతకం సాధించాడు. టీ20ల్లో ఒకే ఏడాది మూడు సెంచరీలు చేసిన బ్యాటర్లలో వైభవ్ సూర్యవంశీ 16వ బ్యాటర్‌గా నిలిచాడు. ఇందులో అతిపిన్న వయస్కుడు సూర్యవంశీనే. భారత్ తరఫున ఈ ఫీట్ సాధించిన ఏడో బ్యాటర్. విరాట్ కోహ్లీ, శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, అభిషేక్ శర్మలు సూర్యవంశీ కంటే ముందు ఈ ఫీట్ సాధించారు. ఈ మ్యాచ్‌లో మహారాష్ట్రనే 3 వికెట్ల తేడాతో గెలుపొందింది. ముందుగా బ్యాటింగ్ చేసిన బిహార్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 176 పరుగులు చేసింది. వైభవ్ సూర్యవంశీ(61 బంతుల్లో 7 ఫోర్లు, 7 సిక్స్‌లతో 108) సెంచరీతో రాణించగా.. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు.

# చరిత్ర సృష్టించిన అభిషేక్ శర్మ

టీమిండియా స్టార్ ఓపెనర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ విధ్వంసకర బ్యాటర్ అభిషేక్ శర్మ చరిత్ర సృష్టించాడు. టీ20ల్లో 19 బంతుల్లోపు 7 హాఫ్ సెంచరీలు నమోదు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ప్రతిష్టాత్మక దేశవాళీ టోర్నీలో భాగంగా ఉప్పల్ వేదికగా బరోడాతో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ తరఫున 18 బంతుల్లో హాఫ్ సెంచరీ నమోదు చేయడం ద్వారా ఈ ఫీట్ సాధించాడు.ఐపీఎల్ హోమ్ గ్రౌండ్ అయిన ఉప్పల్‌లో అభిషేక్ శర్మ విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగాడు. 19 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 50 పరుగులు చేసి లింబానీ బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. గత ఆదివారం బరోడాతో జింఖాన మైదానంలో జరిగిన మ్యాచ్‌లో అభిషేక్ శర్మ భారీ శతకంతో చెలరేగాడు. 52 బంతుల్లో 148 పరుగులు చేశాడు. అదే జోరును తాజా మ్యాచ్‌లోనూ చూపించాడు.టీ20ల్లో అభిషేక్ శర్మకు 19 బంతుల్లోపు ఇది ఏడో హాఫ్ సెంచరీ. అయితే ఇందులో మూడు హాఫ్ సెంచరీ పంజాబ్ తరఫున సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలోనే నమోదు కాగా.. మరో మూడు ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున వచ్చాయి. భారత్ తరఫున ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 17 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. ఈ ఏడు హాఫ్ సెంచరీలు కూడా 2024 తర్వాతే నమోదు కావడం గమనార్హం.ఈ ఏడు హాఫ్ సెంచరీలను అభిషేక్ శర్మ 12, 14, 16, 17, 19 బంతుల్లో సాధించాడు. ఈ క్రమంలో అభిషేక్ శర్మ.. కీరన్ పొలార్డ్ ఆల్‌టైమ్ రికార్డ్‌ను అధిగమించాడు. కీరన్ పొలార్డ్ 14, 17, 17, 18, 19, 19 బంతుల్లో 6 హాఫ్ సెంచరీలు నమోదు చేయగా.. ట్రావిస్ హెడ్ 16, 16, 17, 18, 19 బంతుల్లో 5 హాఫ్ సెంచరీలు నమోదు చేశాడు.ఈ మ్యాచ్‌లో హార్దిక్ పాండ్యా విధ్వంసంతో బరోడా 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. అభిషేక్ శర్మకు తోడుగా అన్మోల్‌ప్రీత్ సింగ్(32 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్స్‌లతో 69) హాఫ్ సెంచరీతో సత్తా చాటడంతో ముందుగా బ్యాటింగ్ చేసిన పంజాబ్ 8 వికెట్లకు 222 పరుగులు చేసింది.



# 'మోగ్లీ 2025' ట్రైలర్ విడుదల..

## ఆకట్టుకున్న సుమ తనయుడు రోషన్




ప్రముఖ యాంకర్ సుమ కనకాల తనయుడు, యువ నటుడు రోషన్ కనకాల హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మోగ్లీ 2025'. ఈ సినిమా విడుదల తేదీని చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. డిసెంబర్ 12న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్నట్టు తెలుపుతూ, సినిమా ప్రమోషన్లలో భాగంగా తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది.జాతీయ అవార్డు గ్రహీత, 'కలర్ ఫోటో' ఫేమ్ సందీప్ రాజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వ ప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. విడుదలైన ట్రైలర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది.ఈ సినిమాలో రోషన్ కనకాల సరసన సాక్షి సాగర్ మదోల్కర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, వైవా హర్ష కీలక పాత్రలో కనిపించనున్నారు. టాలీవుడ్ యువ సంగీత సంచలనం కాలా భైరవ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. వినూత్నమైన కథాంశంతో వస్తున్న ఈ సినిమాతో రోషన్ మంచి విజయాన్ని అందుకుంటాడని చిత్ర బృందం ధీమా వ్యక్తం చేస్తోంది.



# హిందీలో స్టార్‌డమ్ చూపిస్తేనే గౌరవం

ఇస్తారని వ్యాఖ్య లేకపోతే కనీసం కూర్చోవడానికి కుర్చీ కూడా దొరకదని విమర్శ భాషతో సంబంధం లేకుండా పాన్-ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ నటుడు దుల్కర్ సల్మాన్ బాలీవుడ్ పనితీరుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. హిందీ, మలయాళ చిత్ర పరిశ్రమల మధ్య పని సంస్కృతిలో చాలా వ్యత్యాసం ఉందని ఆయన అన్నారు. హిందీలో పెద్ద స్టార్ అనిపించుకోకపోతే తీవ్రమైన నిర్లక్ష్యానికి గురికావాల్సి వస్తుందని తన అనుభవాలను పంచుకున్నారు. ఓ తాజా ఇంటర్వ్యూలో దుల్కర్ మాట్లాడుతూ.. "బాలీవుడ్‌లో నటించేటప్పుడు, నేను స్టార్ అని అందరినీ నమ్మించాల్సి వచ్చేది. నా చుట్టూ ఇద్దరు వ్యక్తులు ఎప్పుడూ ఉండేవారు. మనం లగ్జరీ కారులో వస్తేనే మనల్ని స్టార్‌గా గుర్తిస్తారు. అలా లేకపోతే సెట్‌లో కనీసం కూర్చోవడానికి కుర్చీ కూడా ఇవ్వరు, మానిటర్ చూడటానికి కూడా స్థలం కేటాయించరు" అని అన్నారు. 2018లో 'కార్వాన్' చిత్రంతో దుల్కర్ హిందీ పరిశ్రమలోకి అడుగుపెట్టారు.మలయాళ చిత్ర పరిశ్రమ ఇందుకు పూర్తి భిన్నంగా ఉంటుందని దుల్కర్ వివరించారు. "మా ఇండస్ట్రీలో సినిమాలకు ఎక్కువ ఖర్చు ఉండదు. ఇక్కడ లగ్జరీకి ఎవరూ ప్రాధాన్యం ఇవ్వరు. రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో షూటింగ్ చేస్తాం. చాలా వస్తువులు ఇంటి నుంచే తెచ్చుకుంటాం" అని రెండు పరిశ్రమల మధ్య ఉన్న తేడాను స్పష్టం చేశారు.ఇక దుల్కర్ సినిమాల విషయానికొస్తే, ఆయన ఇటీవలే 'కాంత' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చారు. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా డిసెంబర్ 12 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రసారం కానున్నట్లు తెలుస్తోంది.



# మరణాలను మీమ్స్‌గా మార్చడం పాపం

## : జాన్వీ కపూర్ ఆవేదన

అతిలోక సుందరి, దివంగత శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ సోషల్ మీడియాలో నెలకొన్న ఓ దారుణమైన ధోరణిపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖుల మరణాలను సైతం వినోదం కోసం మీమ్స్‌గా మార్చే సంస్కృతిపై ఆమె తీవ్రంగా స్పందించారు. ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ, ఈ తీరు మానవ నైతికతను దెబ్బతీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.తన తల్లి శ్రీదేవి మరణం గురించి మాట్లాడాల్సి వచ్చిన ప్రతీసారి ఎంతో జాగ్రత్తగా ఉంటానని జాన్వీ తెలిపారు. "అమ్మ మరణాన్ని అడ్డం పెట్టుకుని పబ్లిసిటీ సంపాదించుకోవాలని చూస్తున్నానని ప్రజలు అనుకుంటారేమోనన్న భయంతో చాలాసార్లు ఆ విషయంపై మాట్లాడటానికే వెనుకాడాను. ఆ సమయంలో నేను అనుభవించిన బాధ, భావోద్వేగాలు పూర్తిగా వ్యక్తిగతమైనవి. వాటిని మాటల్లో చెప్పలేను" అని ఆమె తన ఆవేదనను పంచుకున్నారు. ప్రస్తుత జర్నలిజం, సోషల్ మీడియా తీరు ప్రమాదకరంగా మారుతోందని జాన్వీ అన్నారు. "ఇటీవల ధర్మేంద్ర గారు చనిపోయారంటూ వదంతులు సృష్టించి, దానిపైనా మీమ్స్ చేశారు. ఒకరి మరణాన్ని మీమ్‌గా మార్చడం ఎంతో పాపం. ఈ పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది" అని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

2018 ఫిబ్రవరి 24న దుబాయ్‌లోని ఓ హోటల్‌లో బాత్‌టబ్‌లో ప్రమాదవశాత్తు పడి శ్రీదేవి కన్నుమూసిన సంగతి తెలిసిందే. ఆ విషాదం జరిగిన కొద్ది నెలలకే జాన్వీ బాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. తల్లిని కోల్పోయిన బాధలో ఉన్న తమ కుటుంబాన్ని మీడియా ప్రశ్నలు, సోషల్ మీడియా మీమ్స్ మరింత వేదనకు గురిచేశాయని ఆమె గుర్తుచేసుకున్నారు.

# యానిమల్ ఛాన్స్ వచ్చివుంటే తిరస్కరించే దాన్ని

## : రసిక దుగల్




బాలీవుడ్ నటి రసిక దుగల్ మరోసారి తన సంచలన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచింది. పితృస్వామ్యాన్ని ప్రోత్సహించే సినిమాలను తాను ఎప్పటికీ అంగీకరించబోనని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా బాలీవుడ్‌లో భారీ విజయం సాధించిన 'యానిమల్' వంటి సినిమా ఆఫర్ తనకు వస్తే తాను 'నో' చెప్పేదానినని తెలిపింది. 'మీర్జాపూర్', 'ఢిల్లీ క్రైమ్' వంటి పాపులర్ వెబ్ సిరీస్‌లతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రసిక దుగల్.. సినిమాలను ఎంచుకునే విషయంలో తన విధానాన్ని తాజాగా ఒక ఇంటర్వ్యూలో పంచుకుంది. నేను ఎంచుకునే ప్రతి సినిమా యొక్క రాజకీయాలు నాకు చాలా ముఖ్యం. కేవలం పైపైన చూడడం కాకుండా, అది నా నిర్ణయాలకు మూలస్తంభంగా నిలుస్తుంది. ఒకవేళ నాకు 'యానిమల్' వంటి సినిమాలో అవకాశం వచ్చి ఉంటే దానికి నేను ఖచ్చితంగా 'నో' చెప్పేదాన్ని. ఎందుకంటే పితృస్వామ్యాన్ని ప్రోత్సహించే ప్రాజెక్ట్‌ను నేను ఒకరోజు అంగీకరిస్తానేమోననేదే నా అతిపెద్ద భయం అని రసిక దుగల్ అన్నారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

----------

# బాహుబలి నిర్మాతలతో రామ్..

## కెరీర్ లోనే ఫస్ట్ టైమ్ ఇలా!



: ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని అంటేనే మాస్ స్టెప్పులు, లవర్ బాయ్ లుక్స్ గుర్తొస్తాయి. 'ఇస్మార్ట్' ఎనర్జీతో బాక్సాఫీస్ ను షేక్ చేయడం అతని స్టైల్. అయితే ఎప్పుడూ ఒకే రకమైన కథలు చేస్తే కిక్ ఏముంటుంది? అందుకే ఈసారి రామ్ రూటు మార్చారు. ఆడియెన్స్ ను ఎంటర్టైన్ చేయడం మాత్రమే కాదు, ఈసారి సీటు అంచుల మీద కూర్చోబెట్టి భయపెట్టడానికి రెడీ అవుతున్నారు. ప్రస్తుతం 'ఆంధ్రా కింగ్ తాలూకా' సక్సెస్ ను ఎంజాయ్ చేస్తున్న రామ్, తన తర్వాతి సినిమా కోసం ఒక షాకింగ్ డెసిషన్ తీసుకున్నారు. రొటీన్ కమర్షియల్ సినిమాలకు కాస్త గ్యాప్ ఇచ్చి, కెరీర్ లోనే మొట్టమొదటిసారిగా ఒక 'హార్రర్' కథను ఎంచుకున్నారు. రామ్ పోతినేని హార్రర్ సినిమా చేయడం అంటేనే ఒక సెన్సేషన్. ఈ క్రేజీ ప్రాజెక్ట్ కు సంబంధించి మరో ఇంట్రెస్టింగ్ అప్డేట్ ఏంటంటే.. ఈ సినిమాను నిర్మిస్తోంది సాక్షాత్తూ బాహుబలి లాంటి దృశ్యకావ్యాలను అందించిన 'ఆర్కా మీడియా వర్క్స్'. ఇండియాలోనే టాప్ ప్రొడక్షన్ హౌస్ గా పేరున్న ఆర్కా మీడియా, రామ్ తో సినిమా చేస్తుందంటే ఆ స్కేల్ ఏ రేంజ్ లో ఉంటుందో ఊహించుకోవచ్చు. ఇంత పెద్ద బ్యానర్, స్టార్ హీరో కాంబినేషన్ లో సినిమా అంటే బడా డైరెక్టర్ ఉంటారని అనుకోవడం సహజం. కానీ ఇక్కడే అసలు ట్విస్ట్ ఉంది. ఈ సినిమాతో 'కిషోర్' అనే కొత్త దర్శకుడు ఇండస్ట్రీకి పరిచయం కాబోతున్నారు. ఒక డెబ్యూ డైరెక్టర్ చెప్పిన కథకు రామ్, ఆర్కా నిర్మాతలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారంటే ఆ స్క్రిప్ట్ లో విషయం ఏ రేంజ్ లో ఉందో అర్థం చేసుకోవచ్చు. గతంలో విరుపాక్ష లాంటి సినిమాలు హార్రర్ జానర్ లో టాలీవుడ్ స్థాయిని పెంచాయి. ఇప్పుడు రామ్ లాంటి స్టార్ హీరో ఈ జానర్ లోకి రావడం కచ్చితంగా మంచి విషయమే. కొత్త దర్శకుడు కిషోర్ ఈ కథను కేవలం భయపెట్టడానికే కాకుండా, ఒక బలమైన ఎమోషన్ తో రాసుకున్నారని ఇన్ సైడ్ టాక్. 'ఆంధ్రా కింగ్ తాలుకా'లో ఎమోషనల్ గా టచ్ చేసిన రామ్, నెక్స్ట్ ఆర్కా మీడియా ప్రాజెక్ట్ తో ఆడియెన్స్ లో భయం పుట్టించడానికి సిద్ధమయ్యారు.

# అడల్ట్ కామెడీతో సైక్ సిద్దార్థ

టాలీవుడ్ యువ నటుడు నందు, యామిని భాస్కర్ జంటగా నటిస్తున్న సినిమా 'సైక్ సిద్దార్థ'. మిలాంటి యువకుడి కథ అనేది ఉపశీర్షిక. అడల్ట్ కామెడీతో తెరకెక్కుతున్న ఈ మూవీకి వరుణ్ రెడ్డి దర్శకత్వం వహిస్తుండగా ప్రియాంక రెబెకా శ్రీనివాస్, సాక్షి అత్రి, మౌనిక తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. నిర్మాత శ్యామ్ సుందర్ రెడ్డితో పాటు నందు కూడా ఈ చిత్ర నిర్మాణంలో భాగస్వామిగా ఉన్నారు. ఈ చిత్రం డిసెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ ట్రైలర్ చూస్తుంటే అడల్ట్ కామెడీగా ఈ చిత్రం రాబోతుందని తెలుస్తుంది.

